మానేరు
# జనత®
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక

2.06.2025 సోమవారం Monday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 45 | పేజీలు : 8 Pages : 8 | Published from : Karimnagar

## ఫైనల్‌కు పంజాబ్..



ముంబైపై కింగ్స్ ఉత్కంఠ విజయం
శ్రేయాస్ కెప్టెన్ ఇన్నింగ్స్
ఈనెల 3న ఆర్‌సీబీతో ఫైనల్ పోరుకు అర్హత

07

సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..
ఔత్సాహికులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్

# ఉద్యోగుల డిమాండ్లపై సమాలోచన

## మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం



- ఉద్యోగుల సమస్యలు, డీఏలపై కీలక చర్చ
- రిటైర్మెంట్ వయసు ఏడాది పెంపుపై పరిశీలన
- మరింత పకడ్బందీగా రైతుభరోసా అమలు
- సంక్షేమం క్షేత్రస్థాయికి వెళ్లేలా విస్తృత ప్రచారం
- యువవికాసం, భూభారతి, ఇందిరమ్మ ఇళ్లపై చర్చ
- 5న క్యాబినెట్ భేటీ.. అన్నింటిపైనా నిర్ణయం
- ఎన్‌డీఎస్ఏ నివేదికకు ఓకే.. నిర్మాణ సంస్థపై
- చర్యలకు సిఫారసు చేయనున్న మంత్రివర్గం
- ఫోన్ ట్యాపింగ్.. కవిత అంశంపై భేటీలో చర్చ
- రాష్ట్ర ప్రజలకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు: సీఎం రేవంత్

**హైదరాబాద్, జనతా న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు లేవనెత్తిన పలు డిమాండ్లను పరిష్కరించే దిశగా రేవంత్ సర్కారు యోచిస్తోంది. వారి డిమాండ్లపై ఈ నెల 5న జరిగే మంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. ఉద్యోగులకు ఇవ్వాల్సిన డీఏలు, పదవీ విరమణ వయసు పెంపు, సాధారణ బదిలీల అంశాల్లో క్యాబినెట్ భేటీలో కీలక నిర్ణయం తీసుకోనున్నట్టు సమాచారం. ఆదివారం హైదరాబాద్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి.. మంత్రులతో సమావేశమై ఈ మేరకు చర్చించారు. దీంతోపాటు రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు, ఇందిరమ్మ ఇండ్లు, రెవెన్యూ సదస్సులు, వానాకాలం పంటల సాగు సన్నద్ధత, రాజీవ్ యువ వికాసం అంశాలపై మంత్రులు అందించిన నివేదికపై చర్చించారు. ఉద్యోగుల సమస్యలపై నియమించిన కమిటీకి సంబంధించి

మిగతా 2 లో

## ఆవిర్భావ దినోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు

నేడు పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు

- ఉదయం 9.40గంటలకు ప్రారంభం
- జాతీయ జెండా ఎగురవేయనున్న సీఎం
- ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన
- 9 మందికి రూ.కోటి చొప్పున చెక్కులు





## 5న సిట్ ముందుకు వస్తా

లేఖ రాసిన ప్రభాకర్‌రావు!..
ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం
ప్రభాకర్‌రావు వాంగ్మూలమే కీలకం.. ఆయన కనుసన్నల్లోనే ట్యాపింగ్!

02



## తెలంగాణలో గణనీయంగా తగ్గిన సైబర్ నేరాలు

సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీ శిఖా గోయల్

02



## రాష్ట్రంలో కుటుంబ డ్రామాలు

బీజేపీ పాత్రధారి, సూత్రధారి కాదు

- ఆస్తులు, అధికారం, అవినీతి డబ్బు కోసం బీఆర్ఎస్ పార్టీలో గొడవలు
- కాంగ్రెస్ హయాంలో అవినీతి వికేంద్రీకృతం.. రేవంత్ హామీలేమయ్యాయి?: కిషన్‌రెడ్డి
- బీజేపీలో బీఆర్ఎస్ విలీనంపై ఎప్పుడూ చర్చ జరగలేదు: లక్ష్మణ్

రాష్ట్రంలో రాజకీయ, కుటుంబ డ్రామాలు నడుస్తున్నాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. కుటుంబ డ్రామాల్లో బీజేపీ పాత్రధారి, సూత్రధారి కాదని స్పష్టం చేశారు.

## రష్యాపై భీకర దాడులు


- ఎయిర్‌బేసలే లక్ష్యంగా ఉక్రెయిన్ డ్రోన్ల బీభత్సం
- 41 రష్యన్ యుద్ధ విమానాల ధ్వంసం
- ఉక్రెయిన్‌పై రష్యా ప్రతీకార దాడులు
- 12 మంది ఉక్రెయిన్ సైనికుల మృతి



04

## రాజీవ్ యువ వికాసానికి తాత్కాలిక బ్రేక్

నేటి రుణ మంజూరు పత్రాల అందజేత వాయిదా




03

- కొనసాగుతున్న దరఖాస్తుల పరిశీలన
- పూర్తి స్థాయి పరిశీలన తర్వాతే అర్హుల జాబితా

నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం కింద రుణ మంజూరు పత్రాల అందజేతకు తాత్కాలికంగా బ్రేక్ పడింది.





03

## నేటి నుంచి.. స్లాట్ బుకింగ్‌తోనే రిజిస్ట్రేషన్లు

రాష్ట్రంలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసుల్లో.. రోజుకు 48 స్లాట్లు

- అత్యవసర సందర్భాల్లో ఐదు వాకిన్ రిజిస్ట్రేషన్లకు అనుమతి
- రిజిస్ట్రేషన్ సేవల్లో వాట్సాప్ చాట్‌బాట్
- 82476 23578కు వాట్సాప్ చేస్తే.. ఏఐతో సందేహాల నివృత్తి
- రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతానికి ఆధార్ ఈ-సంతకం అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష

రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సోమవారం నుంచి రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్ విధానం అమలులోకి రానుంది. అలాగే, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రజల కు వచ్చే సందేహాల నివృత్తికి కృత్రిమ మేధ(ఏఐ)తో పనిచేసే వాట్సాప్ చాట్‌బాట్‌ను కూడా ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తుంది.



02

## రైతులకు నాణ్యమైన విత్తనాల పంపిణీ

నేడు 40వేల మంది రైతులకు విత్తన కిట్లు: తుమ్మల

## మోదీ, అమిత్ షాకు మానవత్వం లేదు

- మావోయిస్టులపై మారణహోమం ఆపాలి
- కార్పొరేట్లకు ఖనిజ సంపద దోచిపెట్టేందుకే 'కగార్'
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్
- ఆపరేషన్ కగార్ నిలిపివేతకు 14న లెఫ్ట్ పార్టీల ధర్నా
- మద్దతు ప్రకటించిన కాంగ్రెస్, బీఆర్ఎస్





03

## వరుసగా మూడోసారి వడ్డీ రేట్ల కోత

4 నుంచి ఆర్‌బీఐ ఎంపీసీ భేటీ

## యునైటెడ్ ఫూలే ఫ్రంట్ ఇక.. జాగృతి అనుబంధ సంస్థ

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్, జనతా న్యూస్:** యునైటెడ్ ఫూలే ఫ్రంట్ (యూపీఎఫ్) ఇకపై తెలంగాణ జాగృతి అనుబంధ సంస్థగా పని చేస్తుందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న బీసీ రిజర్వేషన్లను అమల్లోకి తెచ్చేవరకు తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని తెలిపారు. ఆదివారం

మిగతా 2 లో



03

## అన్నదాతల బాధలు వినే తీరిక లేదా?

జనుము, జీలుగ విత్తనాలు అందించరా?: హరీశ్

# 5న సిట్ ముందుకు వస్తా

**లేఖ రాసిన ప్రభాకర్‌రావు!.. ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం**

**ప్రభాకర్‌రావు వాంగ్మూలమే కీలకం.. ఆయన కనుసన్నల్లోనే ట్యాపింగ్!**



**హైదరాబాద్, జూన్ 1 :** ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంటోంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్(ఓఎస్డీ) ప్రభాకర్‌రావు ఇన్నాళ్లు అమెరికాలో ఉండగా.. తాను సిట్ ముందుకు వస్తానని, విచారణకు సహకరిస్తానని పేర్కొంటూ లేఖ రాసినట్లు తెలిసింది. ఈ నెల 5న సిట్‌ను కలుస్తానని ఆ లేఖలో చెప్పినట్లు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. సుప్రీంకోర్టు కూడా ముందు భారత్‌కు రావాలని, విచారణకు సహకరించాలని సూచించిన నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ప్రభాకర్‌రావు తరఫు న్యాయవాదులు సుప్రీంకోర్టుకు ఇప్పటికే ఈ మేరకు అండర్‌టేకింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే..! ప్రభాకర్‌రావు విచారణకు సహకరిస్తారని వారు సుప్రీంకోర్టుకు తెలిపారు. ఇక పాస్‌పోర్టును పునరుద్ధరించాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో విదేశాంగ శాఖ అధికారులతో న్యాయవాదులు సంప్రదింపులు జరుపుతున్నారు. 'వన్‌టైం ఎంట్రీ' పాస్‌పోర్టుకు లైన్ క్లియర్ అయ్యే అవకాశాలున్నాయి. పాస్‌పోర్టు జారీ అయిన మూడ్రోజుల్లో ప్రభాకర్‌రావు విచారణకు హాజరు కావాలని సుప్రీంకోర్టు తన మధ్యంతర ఆదేశాల్లో పేర్కొంది. ఆ మేరకు ప్రభాకర్‌రావుపై బలవంతపు చర్యలొద్దంటూ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

**కీలక మలుపునకు చాన్స్**

ఈ కేసులో ఇప్పటి వరకు అరెస్టయిన మాజీ అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎస్డీ) రాధాకిషన్‌రావు తమ వాంగ్మూలాల్లో ప్రభాకర్‌రావు చెప్పినట్లు చేశామని వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు ప్రభాకర్‌రావు విచారణ కీలకంగా మారనుంది. ఆయన వాంగ్మూలంతో కేసు కీలక మలుపులు తిరిగే అవకాశాలున్నాయని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఇప్పటి వరకు రాజకీయ కోణం పెద్దగా బహిర్గతం కాకున్నా.. పలువురు బీఆర్ఎస్ నేతల పేర్లు ప్రముఖంగా వినిపించాయి. ఇప్పుడు ప్రభాకర్‌రావు వాంగ్మూలమిస్తే.. ఎవరి ఆదేశాలతో ఫోన్ ట్యాపింగ్ జరిగింది? హోంశాఖ కార్యదర్శి అనుమతి తీసుకున్నారా? ఒకవేళ అత్యవసరంగా ఫోన్లను ట్యాప్ చేస్తే.. ఆ తర్వాత ఏడు రోజుల్లో లిఖితపూర్వకంగా హోంశాఖ కార్యదర్శికి చెప్పారా? అనే కోణాల్లో ప్రభాకర్‌రావును విచారించే అవకాశాలున్నాయి. సిట్ దర్యాప్తులో దాదాపు 1,200 నంబర్లను ప్రణీత్‌రావు అండ్ కో ట్యాపింగ్ చేసినట్లు తేలగా.. హోంశాఖకు మాత్రం పదుల సంఖ్యలోనే ఫోన్ నంబర్లపై అభ్యర్థనలు వచ్చినట్లు సమాచారం. అయితే.. ప్రభాకర్‌రావు విచారణకు సహకరిస్తారా? అడిగిన ప్రశ్నలకు సూటిగా సమాధానమిస్తారా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

# తెలంగాణలో గణనీయంగా తగ్గిన సైబర్ నేరాలు

**సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీ షిఖా గోయల్**




**హైదరాబాద్, జూన్ 1 :** తెలంగాణలో గత ఏడాది మొదటి నాలుగు నెలలతో పోలిస్తే ఈ ఏడాది సైబర్ నేరాలు గణనీయంగా తగ్గాయని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీ షిఖా గోయల్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణలో జనవరి నుంచి ఏప్రిల్ వరకు 11% సైబర్ నేరాలను తగ్గించగలిగామని, అదే సమయంలో దేశవ్యాప్తంగా సైబర్ నేరాల్లో 28% పెరుగుదల నమోదయిందని ఆమె వివరించారు. దేశవ్యాప్తంగా సైబర్ నేరాల వల్ల ఆర్థిక నష్టాలు 12% పెరగగా, తెలంగాణలో 19% తగ్గాయని ఆమె తెలిపారు. 2024లో 13% ఉన్న రికవరీ రేటు ఈ ఏడాది 16 శాతానికి చేరిందని ఆమె వివరించారు.

**ఆర్ అండ్ బీలో 72 మందికి పదోన్నతులు**

రోడ్లు భవనాల శాఖలో పదోన్నతుల పరంపర కొనసాగుతోంది. తాజాగా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈఈ)లకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)లుగా పదోన్నతి కల్పించింది. సంబంధిత ఫైలుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదం తెలిపారు. ఈ మేరకు త్వరలో ఉత్తర్వులు జారీకానున్నాయి. డీఈఈల నుంచి ఈఈలుగా 72 మందికి పదోన్నతి కలగనుంది. ప్రస్తుతం శాఖలో దాదాపు 60 వరకు ఈ స్థాయి హోదా పోస్టులు ఖాళీగా ఉన్నాయని, మరో 4-5గురు త్వరలో పదవీ విరమణ చేయనున్నట్టు సమాచారం. ఇప్పటివరకు 219 మందికి పదోన్నతులు లభించగా.. వరుసగా శాఖలో పదోన్నతులు వస్తుండడంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# యునైటెడ్ ఫూలే ఫ్రంట్ ఇక.. జాగృతి అనుబంధ సంస్థ : ఎమ్మెల్సీ కవిత

మొదటి పేజీ తరువాయి



తెలంగాణ జాగృతి కార్యాలయంలో యూపీఎఫ్ నాయకులతో కవిత సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యూపీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. యూపీఎఫ్ కన్వీనర్‌గా బొల్లా శివశంకర్, కో ఆర్డినేటర్‌గా ఆలకుంట హరి, సలహాదారుగా గట్టు రాంచందర్‌రావు, మరో 50 మందిని కోకన్వీనర్లుగా నియమించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడబలుక్కొని బీసీ బిల్లులను కోల్డ్ స్టోరేజీలో పెట్టే కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. త్వరలోనే బీసీ బిల్లులు సాకారమయ్యేందుకు పోరాట కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

# ఉద్యోగుల డిమాండ్లపై సమాలోచన

మొదటి పేజీ తరువాయి

అధికారులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఇప్పటికే నివేదిక అందించారు. ఆ నివేదికలోని అంశాలతోపాటు ప్రభుత్వ ఉద్యోగుల సంఘాల ప్రతినిధులతో భేటీ సందర్భంగా వారు ప్రస్తావించిన డిమాండ్లనూ భట్టివిక్రమార్క.. సీఎంకు, మంత్రులకు వివరించారు. దీనిపై ఈ నెల 5న జరిగే క్యాబినెట్ భేటీలో చర్చించాలని, సమస్యల పరిష్కారంపై ఎలా ముందుకెళ్లాలో నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. కాగా, ప్రభుత్వ ఉద్యోగుల అన్ని డిమాండ్లపై ఒక రోడ్‌మ్యాపను సిద్ధం చేయాలని సర్కారు భావిస్తున్నట్టు తెలిసింది. ఈ విషయంలో ప్రభుత్వం రెండు రకాల ఆలోచనలతో ఉన్నట్టు సమాచారం.

మరింత ఆర్థిక భారం పడకుండా..

ఇప్పటికే సర్కారుపై ఆర్థికభారం ఉండడం, దీనికితోడు ఈ ఒక్క ఏడాదే 8వేల మందికి పైగా ఉద్యోగులు రిటైర్ కానుండడంతో.. మరింత భారం పడకుండా ఉద్యోగుల పదవీ విరమణ వయసును ఏడాదిపాటు పెంచితే మంచిదని కొందరు మంత్రులు సూచించినట్లు తెలిసింది. దీంతో పాటు ఉద్యోగుల సాధారణ బదిలీలు చేపట్టడం ప్రభుత్వం మొదటి ఆలోచనగా ఉంది. ఇక రెండోది.. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల డీఏల్లో ఎన్నింటిని ప్రకటించాలనే దానిపై మంత్రివర్గ సమావేశంలో కచ్చితమైన నిర్ణయం తీసుకోనున్నారు. ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యలపై క్యాబినెట్ భేటీలో నిర్ణయం తీసుకోవాలనే అంశంపై చర్చించారు. కాగా, సమావేశంలో అన్ని అంశాలపై మాట్లాడుతున్న సమయంలో ప్రభుత్వ పనితీరు, క్షేత్రస్థాయిలో ప్రభుత్వం పట్ల ఉన్న అభిప్రాయాలను కొందరు మంత్రులు ప్రస్తావించినట్లు తెలిసింది. రైతుభరోసా పథకం గ్రామాల్లో లక్షల మందికి అమలవుతోందని, అయితే దీనిని మరింత పకడ్బందీగా అమలు చేస్తే రైతుల్లో ప్రభుత్వం పట్ల మరింత సానుకూల స్పందన వస్తుందని వారు అభిప్రాయపడినట్లు సమాచారం. కాగా, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలన్నింటినీ క్షేత్రస్థాయికి చేరేలా చర్యలు తీసుకోవాలనే అంశంపైనా సమావేశంలో చర్చించారు. గ్రామ గ్రామానికి ఈ పథకాలను తెలిపేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

**5న మంత్రివర్గ సమావేశం..**

5న మంత్రివర్గ సమావేశం నిర్వహించి కీలక అంశాలపై చర్చించాలని మంత్రుల భేటీలో నిర్ణయించారు. గత నెల జిల్లాల్లో పర్యటించిన మంత్రులు.. అధికారులతో నిర్వహించిన సమీక్షలకు సంబంధించి తయారుచేసిన నివేదికలపై ఈ సమావేశంలో చర్చించారు. రాజీవ్ యువ వికాసం పథకానికి ఊహించిన దానికంటే ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయని, అనర్హులకు లబ్ధి చేకూరకుండా చూడాలంటూ ఫిర్యాదులూ వచ్చాయని మంత్రులు.. సీఎం దృష్టికి తీసుకెళ్లారు. పెద్దసంఖ్యలో వచ్చిన దరఖాస్తుల స్క్రీనింగ్ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో పూర్తి స్థాయి పరిశీలన తరువాతే అర్హుల జాబితాలను ప్రకటించాలని నిర్ణయించారు. మరింత లోతుగా విశ్లేషించి లబ్ధిదారులను గుర్తించాలన్నారు. ఈ అంశంపై క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఇక యాసంగిలో పండిన ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను సమర్థంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నందుకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఇతర మంత్రులు అభినందించారు. రాబోయే వానాకాలం నేపథ్యంలో వ్యవసాయం, నీటిపారుదల ప్రాజెక్టులు, తాగునీటి అవసరాలపైనా చర్చించారు. ప్రధానంగా హైదరాబాద్ నగర ట్రాఫిక్, వర్షాల సమయంలో ప్రబలే వ్యాధుల అంశాలనూ ప్రస్తావించారు. వీటన్నింటిపై రోడ్‌మ్యాప్ రూపొందించాలని నిర్ణయించారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న 'తెలంగాణ రైజింగ్-2047'ను సాధించే దిశగా ముందుకెళ్లాలని, అందుకోసం దానిని ప్రజా ఉద్యమంగా మార్చాలని సమావేశంలో నిర్ణయించినట్టు సీఎం కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

**ఎన్‌డీఎసఏ నివేదికకు ఆమోదం..**

కాళేశ్వరం, దానిపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎసఏ) ఇచ్చిన రిపోర్టుపై సీఎం, మంత్రుల సమావేశంలో చర్చించారు. ఈ నెల 5న జరగనున్న క్యాబినెట్ భేటీలో ఎన్‌డీఎసఏ నివేదికను ఆమోదించాలని నిర్ణయించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. నిర్మాణ సంస్థపై చర్యలకు సిఫారసు చేయాలనే అంశంపైనా చర్చ జరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ పార్టీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని నిర్ణయించిన నేపథ్యంలో.. ఆ అంశంపైనా చర్చించారు. ఇక బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ తరఫున నిరసన గళం బలంగా వినిపించాలని కూడా నిర్ణయించినట్టు తెలిసింది. ఏపీ, తెలంగాణ నీటి కేటాయింపుల విషయంలో రాజీ పడాల్సిన అవసరం లేదని, రాష్ట్ర రాజకీయాల్లో ఇది చాలా సున్నితమైన అంశమని అభిప్రాయపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం కూడా సమావేశంలో చర్చకు వచ్చింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావు ఈ నెల 5న విచారణకు హాజరు కానున్న నేపథ్యంలో.. ఆ తరువాత జరిగే పరిణామాలపైనా చర్చ జరిగినట్లు తెలిసింది. కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఇటీవల ఎమ్మెల్యేలు, మంత్రులతో పాటు ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయాలు తీసుకుంటున్న క్రమంలో ఆ అంశంపైనా చర్చించారు. అనంతరం బీఆర్ఎసలో పరిణామాలు, కవిత కొత్త కార్యాలయం ప్రారంభంపై మాట్లాడుకున్నట్టు సమాచారం. ఈ సందర్భంగా బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేననే అభిప్రాయం ప్రజల్లోకి బలంగా వెళ్లిందని అభిప్రాయపడ్డట్టు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితాలు వస్తాయని మరికొందరు మంత్రులు అన్నట్లు సమాచారం.

**రాష్ట్ర ప్రజలకు ఆవిర్భావ శుభాకాంక్షలు: సీఎం రేవంత్**

తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలు జరుపుకొంటున్న సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు కలిసికట్టుగా పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం పదకొండేళ్లు పూర్తి చేసుకుని పన్నెండో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా రాష్ట్ర సాధన పోరాటంలో ప్రాణాలర్పించిన అమరుల త్యాగాలను సీఎం స్మరించుకున్నారు. ఉద్యమంలో పాలుపంచుకున్న కవులు, కళాకారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, మేధావులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, కార్మికులు, కర్షకులు, మహిళలు, రాజకీయ నాయకులందరికీ అభినందనలు తెలిపారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ రైజింగ్ నినాదంతో రాష్ట్ర ఆర్థిక వృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందన్నారు. అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచేలా సరికొత్త విధానాలతో.. భవిష్యత్తు ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. మేరకు సీఎంవో ఒక ప్రకటన విడుదల చేసింది. ఇదిలా ఉండగా.. మంత్రివర్గ విస్తరణ, పీసీసీ కార్యవర్గాల ఖరారుపై ఏఐసీసీతో మాట్లాడేందుకు త్వరలో సీఎం రేవంత్ ఢిల్లీ వెళ్లనున్నారు.



**సీఎంను కలిసిన మందకృష్ణ**

సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం జూబ్లీహిల్స్ నివాసంలో సీఎంను కలిసి ఆయనతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మందకృష్ణకు సీఎం శాలువా కప్పి సన్మానించారు. రాష్ట్రపతి నుంచి పద్మశ్రీ అవార్డును అందుకున్న ఆయన్ను సీఎం అభినందించారు. కాగా, ఉమ్మడి రాష్ట్ర తొలి సీఎం నీలం సంజీవరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సీఎం నివాళు లర్పించారు.

# ఆవిర్భావ దినోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు



**నేడు పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు**

**ఉదయం 9.40గంటలకు ప్రారంభం**

**జాతీయ జెండా ఎగురవేయనున్న సీఎం**

**ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన**

**9 మందికి రూ.కోటి చొప్పున చెక్కులు**

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రం 12వ పడిలోకి అడుగుపెడుతున్న వేళ.. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్స్‌లో సోమవారం ఉదయం 9.40 గంటలకు వేడుకలు ప్రారంభం కానున్నాయి. కార్యక్రమంలో సీఎం రేవంత్ జాతీయ జెండాను ఎగురవేస్తారు. తర్వాత జాతీయ గీతాన్ని, తెలంగాణ రాష్ట్ర గీతాలాపన, పోలీసుల గౌరవ వందనం, పరేడ్ ఉంటాయి. అనంతరం సీఎం ప్రసంగిస్తారు. పలు రంగాల్లో విశేష సేవలు అందించినవారికి పతకాలను అందిస్తారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కవులు, కళాకారులు, ఇతర ప్రముఖులను సత్కరిస్తారు. డిసెంబర్ 9న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ సందర్భంగా సీఎం చేసిన ప్రకటన మేరకు గూడ అంజయ్య, గద్దర్, బండి యాదగిరి, అందెశ్రీ, గోరటి వెంకన్న, సుద్దాల అశోక్‌తేజ, గొడిశాల జయరాజ్, పాశం యాదగిరి, ఎక్కా యాదగిరిలకు రూ.కోటి చెక్కు, ఫ్యూచర్‌సిటీలో 300 గజాల చొప్పున ఇంటి స్థలం పత్రాలను అందించనున్నారు. మరణించినవారికి సంబంధించి వారి కుటుంబ సభ్యులకు అందజేస్తారు.

**వేడుకలకు జపాన్ అతిథి..**

రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో జపాన్‌లోని కితాక్యూషు నగర మేయర్ కజుహి సా టకేచీ అతిథిగా పాల్గొననున్నారు. ఆయన తన ప్రతినిధి బృందంతో కలసి ఆదివారమే హైదరాబాద్ చేరుకున్నారు. వేడుకల అనంతరం ఐటీసీ కాకతీయ హోటల్‌లో తెలంగాణ ప్రభుత్వం- కితాక్యూషు నగర ప్రతినిధులు పలు అంశాలపై ఒప్పందాలు చేసుకోనున్నారు. ఇటీవల జపాన్ పర్యటనకు వెళ్లిన సందర్భంగా కితాక్యూషు నగరాన్ని సీఎం రేవంత్ సందర్శించారు. హైదరాబాద్‌కు రావాలని మేయర్ టకేచీని ఆహ్వానించారు.

**ముస్తాబైన మహానగరం**

ఆవిర్భావ వేడుకల కోసం మహానగరం సుందరంగా ముస్తాబైంది. ప్రధాన కూడళ్లను, ప్రభుత్వ కార్యాలయాలు, చారిత్రక కట్టడాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. గన్‌పార్కు వద్ద అమరులకు నివాళులు అర్పించనున్న నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

**ప్రజలకు ప్రపంచ సుందరి శుభాకాంక్షలు**

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ప్రపంచ సుందరి ఓపల్ సుచాత శుభాకాంక్షలు తెలిపారు. ఆమెతో పోటీల్లో పాల్గొన్న మరికొందరు అందాల భామలు కూడా శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఒక వీడియోను విడుదల చేశారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాల పంపిణీ

**నేడు 40వేల మంది రైతులకు విత్తన కిట్లు: తుమ్మల**

**హైదరాబాద్, జూన్ 1 :** విత్తన స్వయం సమృద్ధే లక్ష్యంగా రైతులకు నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా "గ్రామ గ్రామానికి వ్యవసాయ విశ్వవిద్యాలయ నాణ్యమైన విత్తన పంపిణి" కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం రాష్ట్రంలోని 11వేల గ్రామాల్లో.. 40 వేల మంది రైతులకు విత్తన కిట్లు అందించనున్నట్టు వెల్లడించారు. జిల్లాల్లో జరిగే రాష్ట్ర అవతరణ వేడుకల్లో ఎంపిక చేసిన అభ్యుదయ రైతులకు ఐదు ప్రధాన పంటలకు సంబంధించిన (వరి, కంది, పెసర, మినుము, జొన్న) నాణ్యమైన విత్తనాల కిట్లను అందిస్తారని పేర్కొన్నారు. ఎంపిక చేసిన మిగతా అభ్యుదయ రైతులకు జూన్ 3న ఆయా గ్రామల్లో స్థానిక వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలో విత్తన కిట్లను పంపిణీ చేస్తారని ఆయన తెలిపారు.



# రాష్ట్రంలో కుటుంబ డ్రామాలు

**ఆస్తులు, అధికారం, అవినీతి డబ్బు కోసం బీఆర్ఎస్ పార్టీలో గొడవలు**

**కాంగ్రెస్ హయాంలో అవినీతి వికేంద్రీకృతం.. రేవంత్ హామీలేమయ్యాయి?: కిషన్‌రెడ్డి**

**బీజేపీలో బీఆర్ఎస్ విలీనంపై ఎప్పుడూ చర్చ జరగలేదు: లక్ష్మణ్**




**హైదరాబాద్:** రాష్ట్రంలో రాజకీయ, కుటుంబ డ్రామాలు నడుస్తున్నాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. కుటుంబ డ్రామాల్లో బీజేపీ పాత్రధారి, సూత్రధారి కాదని స్పష్టం చేశారు. ఆస్తులు, అధికారం, అవినీతి డబ్బుల కోసం బీఆర్ఎసలో గొడవలు జరుగుతున్నాయని, వాటితో బీజేపీకి సంబంధం లేదని అన్నారు. ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలనా విజయాలకు సంబంధించి ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో అవినీతి కేంద్రీకృతం కాగా, కాంగ్రెస్ హయాంలో వికేంద్రీకృతం అయిందని విమర్శించారు. వందలాది మంది బలిదానంతో తెలంగాణను సాధించుకున్నది కేసీఆర్ కుటుంబం, కాంగ్రెస్ నాయకులు దోచుకోవడానికా..? అని మండిపడ్డారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ తెలంగాణను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టాయని ఆరోపించారు. ఈ రెండు ప్రభుత్వాల వైఖరి వల్ల రూ.10లక్షల కోట్ల అప్పు అయిందని, ఒక్క సింగరేణికే సర్కారు రూ.42వేల కోట్లు బాకీ ఉందని పేర్కొన్నారు. పాల నా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు సీఎం రేవంత్ పాకిస్థాన్‌తో యుద్ధం గురించి మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన హామీల అమలు ఏమైందో రేవంత్ మాట్లాడరని మండిపడ్డారు. తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ వస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని స్పష్టం చేశారు. 11 ఏళ్ల మోదీ పాలనలో చేపట్టిన కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకువెళ్లాలని పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అవినీతి, కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కిషన్‌రెడ్డి ఈ సందర్భంగా సూచించారు.

**బీఆర్ఎస్‌విలీనంపై కేసీఆర్‌ను అడగాలి: లక్ష్మణ్**

బీజేపీలో బీఆర్ఎస్ విలీన ప్రక్రియ ఎప్పుడూ చర్చకు రాలేదని, విలీనం సంగతిని కేసీఆర్‌నే అడగాలని ఎంపీ లక్ష్మణ్ అన్నారు. అధికారంలో ఉన్నప్పు డు కాంగ్రెస్ కులగణనపై మాట్లాడలేదని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడే అది గుర్తుకు వస్తుందన్నారు. నిజా మాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం లక్ష్మ ణ్ మీడియాతో మాట్లాడారు. కులగణనపై మోదీ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని చెప్పారు.

**మహేశ్ గౌడ్ కేసీఆర్ కోవర్టు**

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్.. కేసీఆర్ కోవర్టు అని బీజేపీ ఎమ్మెల్యేలు ఆరోపించారు. తమ పార్టీ ఎంపీ ఈటల రాజేందర్ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ఆయన కుట్రలు చేస్తున్నారని పైడి రాకేశ్‌రెడ్డి, పాల్వాయి హరీశ్, ధన్‌పాల్ సూర్యనారాయణ, రామారావు పటేల్ మండిపడ్డారు. కాగా, ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ భరోసా పేరిట కొత్త కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రతీరోజు ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు ఒక ముఖ్య నేత రాష్ట్ర పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. తొలిరోజు సోమవారం ఎంపీ ఈటల ఉ ంటారు.

# మోదీ, అమిత్ షాకు మానవత్వం లేదు

**మావోయిస్టులపై మారణహోమం ఆపాలి**

**కార్పొరేట్లకు ఖనిజ సంపద దోచిపెట్టేందుకే 'కగార్'**

**టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్**

**ఆపరేషన్ కగార్ నిలిపివేతకు 14న లెఫ్ట్ పార్టీల ధర్నా**

**మద్దతు ప్రకటించిన కాంగ్రెస్, బీఆర్ఎస్**



**హైదరాబాద్, జూన్ 1 :** మావోయిస్టులపై మారణ హోమం నిలిపివేయాలని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ఆదివారం శాంతి చర్చల కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, పౌర హక్కుల నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలకు కనీస మానవత్వం కూడా లేదని విమర్శించారు. ఛత్తీసగఢ్, జార[illegible]ండ్ రాష్ట్రాల్లోని అత్యంత విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ఆదివాసీలు, వారికి అండగా నిలిచిన మావోయిస్టుల నిర్మూలనకు కేంద్రం పూనుకున్నదని ఆరోపించారు. మావోయిస్టు సిద్ధాంతాలను తాను అంగీకరించకపోయినా, సమ సమాజ స్థాపన కోసం సర్వం తాగ్యం చేసిన నంబాల కేశవరావు మరణం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. వ్యక్తులను చంపగలరే గానీ, సిద్ధాంతాలను నిర్మూలించలేరని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పారని గుర్తు చేశారు. శాంతి చర్చల కమిటీ చేపట్టే కార్యాచరణకు కాంగ్రెస్ పార్టీ మద్దతు ఉంటుందని మహేశ్ చెప్పారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌ను ట్రంప్ జోక్యంతో నిలిపిన వారు దేశ పౌరులపై మారణ హోమం సాగిస్తున్నారని దుయ్యబట్టారు. ఎమ్మెల్సీ కోదండరామ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ మార్గంలోనే ఈ సమస్యలకూ పరిష్కారం దొరుకుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆపరేషన్ కగార్‌కు తమ పార్టీ వ్యతిరేకమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తెలిపారు. మానవ హక్కుల వేదిక కన్వీనర్ జీవన్‌కుమార్ మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ నిలిపివేత కోరుతూ దేశంలోని ఆదివాసీ, దళిత, ప్రతిపక్ష ఎంపీలకు లేఖలు రాద్దామని ప్రతిపాదించగా, సభికులంతా అంగీకారం తెలిపారు. ఆపరేషన్ కగార్ నిలిపేయడంతోపాటు శాంతి చర్చలు జరుపాలని కోరుతూ 14న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద మహా ధర్నా చేపట్టాలని వామపక్ష పార్టీల తీర్మానానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలు మద్దతు ప్రకటించారు. ఈ సమావేశానికి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అధ్యక్షత వహించారు.

**చితాభస్మాన్నీ ఇవ్వలేదు**

నంబాల కేశవరావు మృతదేహం ఇవ్వడానికి నిరాకరించిన కేంద్రం.. చివరకు ఆయన చితాభస్మాన్ని కూడా కుటుంబ సభ్యులు తీసుకోవడాన్ని నిరాకరించడం అమానుషమని పూర్వ విప్లవ విద్యార్థుల వేదిక సదస్సులో పాల్గొన్న వక్తలు పేర్కొన్నారు. 'సాయుధ విప్లవ పోరాటం- శాంతి చర్చలు' అనే అంశంపై జరిగిన సదస్సును సామాజిక వేత్త ఆచార్య హరగోపాల్ ప్రారంభిస్తూ రాజ్యం హద్దులు దాటినప్పుడు పౌర సమాజం గళం విప్పాలని హితవు చెప్పారు.

# నేటి నుంచి.. స్లాట్ బుకింగ్‌తోనే రిజిస్ట్రేషన్లు

**రాష్ట్రంలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసుల్లో.. రోజుకు 48 స్లాట్లు**

**అత్యవసర సందర్భాల్లో ఐదు వాకిన్ రిజిస్ట్రేషన్లకు అనుమతి**

**రిజిస్ట్రేషన్ సేవల్లో వాట్సాప్ చాట్‌బాట్**

**82476 23578కు వాట్సాప్ చేస్తే.. ఏఐతో సందేహాల నివృత్తి**

**రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతానికి ఆధార్**

**ఈ-సంతకం అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష**



**హైదరాబాద్, జూన్ 1 :** రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సోమవారం నుంచి రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్ విధానం అమలులోకి రానుంది. అలాగే, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రజల కు వచ్చే సందేహాల నివృత్తికి కృత్రిమ మేధ(ఏఐ)తో పనిచేసే వాట్సాప్ చాట్‌బాట్‌ను కూడా ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తుంది. 82476 23578 నెంబర్‌కు సందేహాలను వాట్సాప్ చేస్తే ఏఐ సమాధానం ఇస్తుంది. స్లాట్ బుకింగ్ విధానాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలులోకి తీసుకువస్తున్న నేపథ్యంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్టాంప్‌లు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో ఆదివారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా ఇప్పటివరకు రెండు విడతల్లో 47 చోట్ల స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేశామన్న మంత్రి.. సోమవారం నుంచి మిగిలిన 97 కార్యాలయాల్లో కూడా అమలు చేస్తున్నామని తెలిపారు స్లాట్ బుకింగ్ విధానం అమలులో ఎలాంటి సాంకేతిక సమస్యలు ఎదురుకాకుండా చూడాలని స్పష్టం చేశారు. స్లాట్ బుకింగ్ విధానంపై 94 శాతం ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. తొలి దశలో 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏప్రిల్ 10 నుంచి ఇప్పటివరకు 30,592 డాక్యుమెంట్లు, రెండో దశలో 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మే 12 నుంచి ఇప్పటివరకు 14,099 డాక్యుమెంట్లు మొత్తం 45,191 రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. స్లాట్ బుకింగ్ వల్ల సాధారణం కంటే మూడు వేల డాక్యుమెంట్లు ఎక్కువగా రిజిస్ట్రేషన్ జరిగాయని ఆయన తెలిపారు.


**రోజుకి 48 స్లాట్లు, వాట్సాప్ చాట్‌బాట్**

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయింత్రం 5 గంటల వరకు(మధ్యాహ్న భోజన విరామ సమయం మినహాయించి) రిజిస్ట్రేషన్ కోసం ప్రజలు స్లాట్ బుక్ చేసుకోవచ్చునని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. ప్రతి కార్యాలయంలో రోజుకు 48 స్లాట్‌లు అందుబాటులో ఉంటాయని చెప్పారు. స్లాట్ బుకింగ్ చేసుకోని వారి కోసం.. అత్యవసర సందర్భాల్లో సాయంత్రం 5 నుంచి 5.30 గంటల వరకు ఐదు వాకిన్ రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇచ్చామని తెలిపారు. ఇక, ఏఐ అనుసంధానంతో పని చేసే వాట్సాప్ చాట్‌బాట్‌ను అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందుబాటులోకి తెచ్చామని వెల్లడించారు. రిజిస్ట్రేషన్ చేసుకునే వారు తమ సందేహాలు నివృత్తి చేసుకోవచ్చునని వివరించారు. రిజిస్ట్రార్ కార్యాలయం లొకేషన్, స్లాట్ బుకింగ్ ఖాళీలు, సమయం, గిఫ్ట్ డీడ్, సేల్ డీడ్‌పై వసూలు చేసే రుసుములు తదితర వివరాలపై ఏఐ చాట్‌బాట్ సమాచారం ఇస్తుందని తెలిపారు. అదే విధంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ఆధార్ ఈ-సంతకం విధానాన్ని ప్రవేశపెడుతున్నామని మంత్రి పొంగులేటి చెప్పారు. తొలుత ఈ విధానాన్ని నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, ఖమ్మం జిల్లా కూసుమంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామని క్రమంగా రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. ఇక, అక్రమాలకు చెక్ పెట్టేలా లేఅవుట్‌ల్లో డబుల్ రిజిస్ట్రేషన్‌లు జరగకుండా ఉండేందుకు రిజిస్ట్రేషన్ పూర్తయిన, పూర్తి కాని ప్లాట్ల వివరాలు రిజిస్ట్రేషన్ కార్యాలయం, బిల్డర్, డెవలపర్ దగ్గర ఉండేలా త్వరలో రిజిస్ట్రేషన్ మాడ్యూల్‌ను తీసుకువస్తామని తెలిపారు. ఈ మాడ్యూల్‌లో రిజిస్ట్రేషన్ పూర్తయిన ప్లాట్ల వివరాలు ఎర్ర రంగులో కనిపిస్తాయని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. కాగా, స్లాట్ బుకింగ్ విధానం దృష్ట్యా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పనిభారం అధికంగా ఉన్న పటాన్‌చెరు, యాదగిరిగుట్ట, గండిపేట, ఇబ్రహీంపట్నం, సూర్యాపేట, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల్ సహా తొమ్మిది చోట్ల అదనపు సబ్ రిజిస్ట్రార్, సిబ్బందిని నియమించామని ఆయన వివరించారు.

# రాజీవ్ యువ వికాసానికి తాత్కాలిక బ్రేక్

**కొనసాగుతున్న దరఖాస్తుల పరిశీలన**

**పూర్తి స్థాయి పరిశీలన తర్వాతే అర్హుల జాబితా**




**హైదరాబాద్, జూన్ 1:** నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం కింద రుణ మంజూరు పత్రాల అందజేతకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. వాస్తవానికి సోమవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున ప్రారంభించి ఈ నెల 9వరకు లబ్ధిదారులకు ఈ పత్రాలు పంపిణీ చేయాల్సి ఉంది. అయితే వీటి పంపిణీకి సంబంధించి ఆదివారం రాత్రి వరకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రాకపోవడంతో ఏర్పాట్ల విషయంలో అధికార యంత్రాంగం అయోమయంలో పడిపోయింది. ఎట్టకేలకు సోమవారం జరగాల్సిన రుణ మంజూరు పత్రాల అందజేత విషయంపై ఆదివారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులతో నిర్వహించిన సమావేశంలో వాయిదా వేసినట్లు ప్రకటించారు. సమావేశంలో రాజీవ్ యువ వికాసంపై చర్చించారు. ఈ సందర్భంగా రాజీవ్ యువ వికాసానికి అంచనాలకు మించి దరఖాస్తులు వచ్చాయని, అనర్హులకు పథకం అందకుండా చూడాలన్న ఫిర్యాదులు పెద్దఎత్తున వచ్చాయని మంత్రులు సమావేశంలో సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దరఖాస్తుల స్క్రీనింగ్ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో పూర్తిస్థాయి పరిశీలన తర్వాతే అర్హుల జాబితాల ను ప్రకటించాలని నిర్ణయం తీసుకున్నారు. మరింత లోతు గా విశ్లేషించి లబ్ధిదారులను గుర్తించాలని నిర్ణయించారు. ఒక్క అనర్హుడికీ రాజీవ్ యువ వికాసం ద్వారా లబ్ధి చేకూరవద్దని తెలిపారు. ఈ అంశంపై క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. కాగా ఈ నెల 5న క్యాబినెట్ సమావేశం నిర్వహించాలని నిర్ణయించగా.. ఈ సమావేశంలో యువ వికాసంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**ఈ కారణాలూ పరిగణనలోకి..**

రాజీవ్ యువ వికాసం పథకానికి రాష్ట్రవ్యాప్తంగా 16.23 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా.. ఇందులోంచి 5 లక్షల మంది లబ్ధిదారులను ఎంపిక చేసి స్వయం ఉపాధి కల్పించాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఈ నేపథ్యంలో ఈ నెల 2 నుంచి 9 వరకు రుణ మంజూరు పత్రాలు పంపిణీ జరుగుతుందని అంతా ఎదురుచూశారు. మొదటి విడతలో రూ.50వేల నుంచి రూ.లక్షలోపు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మాత్రమే మంజూరు పత్రాలు అందజేస్తామని ఇటీవల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. కేటగిరీ-1లో రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు దరఖాస్తుదారుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. దాదాపు 2.8 లక్షల మందికి ఈ కేటగిరీ కింద యూనిట్లు మంజూ రు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం కాగా 1,32,634 మందే దరఖాస్తు చేసుకున్నారు. రూ.50వేలలోపు యూనిట్‌కు పూర్తి రాయితీ ప్రకటించినా 39,401 మంది మాత్రమే దరఖాస్తు చేశారు. రూ.లక్షలోపు యూనిట్లకు 90% రాయితీని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఈ కేటగిరీల్లో 93,233 దరఖాస్తులు వచ్చాయి. గరిష్ఠ ధర రూ.4 లక్షలు కలిగిన యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకే ఎక్కువ మంది ఆసక్తి చూపారు. అయితే దరఖాస్తులో పేర్కొన్న యూనిట్లను ఆ తర్వాత కూడా అభ్యర్థి మార్చుకునే వెసులుబాటు ఉండడంతో కొన్ని మార్పులు జరిగే అవకాశం ఉంది.

# అన్నదాతల బాధలు వినే తీరిక లేదా?

**జనుము, జీలుగ విత్తనాలు అందించరా?: హరీశ్**



**హైదరాబాద్, జూన్ 1 :** అందాల పోటీలకు వెళ్లే తీరిక ఉన్న సీఎం రేవంత్‌రెడ్డికి రైతుల బాధలు, కష్టాలు వినే తీరిక లేకుండాపోయిందని మాజీమంత్రి హరీశ్ రావు విమర్శించారు. మార్కెట్ యార్డుల్లో ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులకు జనుము, జీలుగ విత్తనాలను ఎందుకు అందించలేకపోతున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం తీగుల్‌లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం పార్టీ గ్రామ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం సభలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. అభివృద్ధి పనులు చేయడానికి డబ్బుల్లేవని చెప్పే రేవంత్‌రెడ్డి వందల కోట్లతో అందాల పోటీలు ఎలా నిర్వహించారని నిలదీశారు. ప్రభుత్వ పరంగా అందాల పోటీలను నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ పరువు తీశారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజుశ్రవణ్ ఆరోపించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. సీఎం అందాల పోటీలకు ప్రాధాన్యం ఇచ్చారు కానీ.. అకాల వర్షాలతో పంటనష్టపోయి విలవిల్లాడుతున్న రైతన్నల ఆవేదనను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.


# వరుసగా మూడోసారి వడ్డీ రేట్ల కోత

**4 నుంచి ఆర్‌బీఐ ఎంపీసీ భేటి**




ముంబై: దేశంలో ద్రవ్యోల్బణం అదుపులో ఉన్న నేపథ్యంలో వృద్ధికి ఊతం ఇచ్చేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఈ వారంలో మరోసారి రేట్ల కోత ప్రకటించే ఆస్కారం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అదే జరిగితే వరుసగా మూడోసారి ఆర్‌బీఐ కీలక రెపో రేటును తగ్గించినట్టవుతుంది. ప్రపంచంలో నెలకొన్న అస్థిరతల నేపథ్యంలో ఈసారి కూడా వృద్ధికి ఊతం ఇచ్చేందుకే ఆర్‌బీఐ మొగ్గు చూపవచ్చని వారి అభిప్రాయం. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా సారథ్యంలోని ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) ద్వైమాసిక సమావేశం వచ్చే బుధవారం (4వ తేదీ) నుంచి శుక్రవారం (6వ తేదీ) వరకు జరగనుంది. శుక్రవారం ఉదయం ఎంపీసీ నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా ప్రకటిస్తారు. ఆర్‌బీఐ ఇప్పటికే ఫిబ్రవరి, ఏప్రిల్ నెలల్లో జరిగిన సమావేశాల్లో 2 విడతలుగా 0.50% మేరకు రెపో రేటును తగ్గించడంతో ప్రస్తుతం అది 6% వద్ద ఉంది.

మానేరు జనత
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
సోమవారం 2 జూన్ 2025


# త్వరితగతిన స్థానిక సంస్థల ఎన్నికలు

## అప్పుడే క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం

## మీనాక్షికి స్పష్టం చేసిన కాంగ్రెస్ నేతలు

**హైదరాబాద్, జూన్ 1 :** క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలోపేతం కావాలంటే త్వరితగతిన స్థానిక సంస్థల ఎన్నికలు జరపాల్సిందేనంటూ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌కు ఆ పార్టీ ఎంపీలు, కంటెస్టెడ్ ఎంపీలు, వివిధ కార్పొరేషన్లు, సంస్థల చైర్మన్లు స్పష్టం చేశారు. అలాగే నామినేటెడ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, గ్రామ స్థాయి నుంచి డీసీసీ స్థాయి వరకూ కమిటీల ఏర్పాటునూ పూర్తి చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలతో లక్షన్నర మంది వరకు పార్టీ నేతలు, కార్యకర్తలకు పదవులు లభిస్తాయని.. కమిటీలు, నామినేటెడ్ పోస్టుల భర్తీతో లక్షలాది మంది నేతలు, కార్యకర్తలు కొత్త బాధ్యతలు చేపడతారని వివరించారు. దీంతో క్షేత్ర స్థాయిలో పార్టీ పుంజుకుంటుందని, ప్రభుత్వ పథకాలను, పార్టీ కార్యక్రమాలను చురుకుగా ప్రజల్లోకి తీసుకెళ్తారని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ బలోపేతంపై వరుస సమీక్షలు జరుపుతున్న మీనాక్షి.. ఆదివారం హైదరాబాద్‌లోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో పార్టీ ఎంపీలు, కంటెస్టెడ్ ఎంపీలు, వివిధ కార్పొరేషన్లు, సంస్థల చైర్మన్లతో ముఖాముఖి సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు.

అయితే సైద్ధాంతిక పునాదులపై పార్టీ నిర్మాణం జరగాలని ఈ సందర్భంగా పలువురు చెప్పారు. ప్రభుత్వ పథకాల పట్ల ప్రజల్లో స్పందన ఎలా ఉందని.. అవి వారికి చేరుతున్నాయా అని మీనాక్షి నేతలతో ఆరా తీయగా.. పూర్తిస్థాయిలో పథకాలు అందకపోవడంతో ప్రజల్లో కొంతమేర అసంతృప్తి నెలకొందని పలువురు చెప్పినట్లు తెలిసింది. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రభుత్వం ప్రజలకు తెలియజేయడంతో ఆ అసంతృప్తి తీవ్ర స్థాయికి చేరలేదని చెప్పినట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికల్లో ఓడిన పార్టీ అభ్యర్థులను.. ఓటమికి గల కారణాలను మీనాక్షి అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ ఓటు బ్యాంకు బీజేపీకి భారీ ఎత్తున బదిలీ కావడం వల్లే తాము ఓడామని వారు చెప్పినట్లు సమాచారం. ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణలో కాంగ్రెస్ ప్రధాన ప్రత్యర్థి ఎవరంటూ పార్టీ ఎంపీలు, కంటెస్టెడ్ ఎంపీలు, కార్పొరేషన్ చైర్మన్లను మీనాక్షి ఆరా తీశారు. కాంగ్రెసకు బీఆర్ఎస్, బీజేపీలు ఎక్కడెక్కడ ప్రత్యామ్నాయంగా ఉన్నాయని అడిగారు. ఉత్తర తెలంగాణలో బీజేపీ, దక్షిణ తెలంగాణలో బీఆర్ఎస్ కాంగ్రెసకు ప్రత్యామ్నాయంగా ఉన్నాయని సదరు నేతలు చెప్పినట్లు తెలిసింది.

# నేడు పలు జిల్లాలకు వర్ష సూచన



**హైదరాబాద్, జూన్ 1 :** రాష్ట్రంలో సోమ, మంగళవారాల్లో పలు జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వర్ష సూచన చేసింది. కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. సోమవారం నారాయణపేట, వనపర్తి, గద్వాల, నల్లగొండ, వికారాబాద్, మెదక్, సంగారెడ్డి, జనగాం, ఖమ్మం జిల్లాల్లో కొన్ని చోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. మంగళవారం ములుగు, కొత్తగూడెం, యాదాద్రి, వికారాబాద్, నారాయణపేట, వనపర్తి, గద్వాల జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

# కామాఖ్య దేవిపై వివాదాస్పద వ్యాఖ్యలు

## ఎక్స్‌లో పోస్టు చేసిన కోల్‌కతా వ్యక్తిపై ఫిర్యాదు

**హైదరాబాద్, జూన్ 1 :** అసోంలోని ప్రముఖ హిందూ దేవత అయిన కామాఖ్య దేవిపై ఎక్స్‌లో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కోల్‌కతాకు చెందిన రషీది వజహత్‌పై చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్‌కు ఫిర్యాదు అందింది. తెలంగాణ బీజేపీ లీగల్ సెల్ న్యాయవాది కె.కరుణా సాగర్ ఈ ఫిర్యాదు చేశారు. కామాఖ్య దేవి ఫొటో పెట్టి అభ్యంతరకర భాషలో రషీది వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు.

దీనిపై సోషల్ మీడియాలో విమర్శలు రావడంతో అతడు ఆ పోస్టును తర్వాత తొలగించాడు. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి బాలీవుడ్ నటుల్లో కొందరు మౌనం వహించడంపై శర్మిష్ఠ పనోలీ చేసిన వ్యాఖ్యలపై ఫిర్యాదు చేసిన వారిలో ఈ రషీదీ కూడా ఉన్నాడని తెలిపారు. అతడిపై కేసు నమోదు చేయాలని కోరారు.



# రష్యాపై భీకర దాడులు

- ఎయిర్‌బేసలే లక్ష్యంగా ఉక్రెయిన్ డ్రోన్ల బీభత్సం
- 41 రష్యన్ యుద్ధ విమానాల ధ్వంసం
- 4 వేల కిలోమీటర్ల దూరంలోని సైబీరియాలోనూ లక్ష్యాలను ఛేదించిన డ్రోన్లు
- ధ్వంసమైన విమానాల్లో టీయూ-22ఎం3, టీయూ-95 బాంబర్లు
- ఏ-50 అవాక్స్‌పైనా విధ్వంసక దాడి
- 18 నెలలుగా వ్యూహాత్మక ఆపరేషన్
- ట్రక్కుల్లో ఎఫ్‌పీవీ డ్రోన్లను పంపిన ఉక్రెయిన్
- పార్క్ చేసిన ట్రక్కులు, ఇళ్లపైన మోహరింపు
- రిమోట్ కంట్రోల్‌తో ఆపరేట్ చేసిన ఎస్‌బీయూ
- ఉక్రెయిన్‌పై రష్యా ప్రతీకార దాడులు
- 12 మంది ఉక్రెయిన్ సైనికుల మృతి



**కీవ్, జూన్ 1:** ఉక్రెయిన్‌ను వారంరోజుల్లో చుట్టేస్తామంటూ మూడేళ్ల క్రితం యుద్ధానికి దిగిన రష్యాకు ఆదివారం పెద్ద దెబ్బ తగిలింది. ఈ యుద్ధం 1,192వ రోజుకు చేరుకోగా.. 'ఆపరేషన్ వెబ్' పేరుతో రష్యా గడ్డ మీది నుంచే ఉక్రెయిన్ జరిపిన డ్రోన్ దాడుల్లో రష్యాలోని నాలుగు ఎయిర్‌బేసలు టార్గెట్ అయ్యాయి. 18 నెలలుగా ఆ ఆపరేషన్‌ను వ్యూహాత్మకంగా కొనసాగించి, ట్రక్కుల్లో రష్యాకు డ్రోన్లను పంపిన ఉక్రెయిన్.. ఆధునిక యుద్ధతంత్రంలో తనదైన ముద్రవేస్తూ రిమోట్ కంట్రోళ్లతో ఆకస్మిక దాడులు జరిపింది. ఈ దాడుల్లో 41 రష్యా యుద్ధ విమానాలను బుల్లి డ్రోన్లు(ఎఫ్‌పీవీ కామికాజి) తుత్తునియలు చేశాయి. ఉక్రెయిన్ సరిహద్దుల నుంచి 700 కిలోమీటర్లు మొదలు.. 4వేలకు పైగా కిలోమీటర్ల దూరంలో ఉండే నాలుగు ఎయిర్‌బేసలు బెలాయా, డియాగిలెవ్, ఒలేన్యా, ఇవానోవోపై ఆదివారం ఉదయం ఉక్రెయిన్ ముప్పేట దాడులు చేసింది. వీటిల్లో బెలాయా ఎయిర్‌బెస్ ఉక్రెయిన్ సరిహద్దులకు 4 వేలకు పైగా కిలోమీటర్ల దూరంలో ఉండే ఇర్కుట్స్క్ రీజియన్‌లో ఉండడం గమనార్హం..! "రష్యాపై ఉక్రెయిన్ దీర్ఘశ్రేణి క్షిపణుల, డ్రోన్లను ఉపయోగించుకోవచ్చు" అంటూ పాశ్చాత్య దేశాల నుంచి అనుమతి వచ్చిన వెంటనే.. రష్యా అవాక్కయ్యేలా ఉక్రెయిన్ క్షిపణులతో కాకుండా.. ఆ దేశ గడ్డ మీద నుంచే చిన్న డ్రోన్లతో దాడులు జరపడం గమనార్హం..! ఈ దాడులను ఉక్రెయిన్ అధికారిక వార్తాసంస్థ 'ఉక్రిఇన్ఫాం'తోపాటు.. రష్యా వార్తా సంస్థ ఏఎఫ్‌పీ, ఆర్టీ కూడా నిర్ధారించాయి. ఇర్కుట్స్క్ గవర్నర్ ఐగర్ కోబ్జెవ్‌తోపాటు.. రియాజన్, ముర్మన్స్క్ రీజియన్ల అధికారులు కూడా ఎయిర్‌బేసలపై దాడులు జరిగిన విషయాన్ని అంగీకరించారు. పైన పేర్కొన్న ఎయిర్‌బేసలలో.. డ్రోన్ దాడుల తర్వాత కాలిపోతున్న రష్యన్ యుద్ధ విమానాల వీడియోలు వైరల్ అవుతున్నాయి. 'ఆపరేషన్ వెబ్'తో ఒక ఏ-50 (అవాక్స్) విమానం సహా.. టీయూ-22ఎం3, టీయూ-95 బాంబర్ విమానాలు.. మొత్తం 41 యుద్ధ విమానాలు బుగ్గిపాలయ్యాయి. బెలయా ఎయిర్‌ఫీల్డ్ పూర్తిగా ఆహుతైంది. ఒక్కో టీయూ-22ఎం3 బాంబర్ ధర రూ.2,505 కోట్లు, టీయూ-95 బాంబర్ ధర రూ.1,361 కోట్లుగా ఉంటుందని అంచనా. దీన్ని బట్టి.. ఉక్రెయిన్ దాడుల్లో రష్యాకు వేల కోట్ల నష్టం వాటిల్లినట్లు స్పష్టమవుతోంది. ఈ ఆపరేషన్‌ను ఉక్రెయిన్ సెక్యూరిటీ సర్వీస నిర్వహించినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి.


**రష్యా ప్రతీకార దాడులు..**

ఉక్రెయిన్ డ్రోన్ దాడులతో రగిలిపోయిన రష్యా.. ఆదివారం ఉదయం నుంచి ఉక్రెయిన్‌పై 83 సార్లు వేర్వేరు దాడులు జరిపింది. ఖార్కివ్, కుపియాంక్, లైమన్, టోరెట్స్క్, క్రామాటోర్స్క్, పొక్రోవ్స్క్, నోవోపావ్లివ్కాల్లో మధ్యాహ్నం నుంచి పలు విడతలుగా డ్రోన్, క్షిపణి దాడులు జరిపింది. ఈ మూడేళ్ల యుద్ధంలో రష్యా ఒక్కరోజే 472 డ్రోన్లతో దాడి చేయడం ఇదే మొదటి సారి అని ఉక్రెయిన్ వైమానిక దళం చెప్పింది. తమ గగనతల రక్షణ వ్యవస్థలు 300కు పైగా డ్రోన్లను కూల్చివేసినట్లు ప్రకటించింది. ఖార్కివ్, ఫిహొల్కివ్కా ప్రాంతాల్లో ఉక్రెయిన్, రష్యా పదాతిదళాల మధ్య భీకరంగా కాల్పులు జరుగుతున్నట్లు జనరల్ స్టాఫ్ వర్గాలు వెల్లడించాయి. ఆదివారం రాత్రి సుమారు అరగంట పాటు రాజధాని నగరం కీవ్‌లో సైరన్ల మోత వినిపించిందని, కుపియాంక్, స్టెపోవా, నోవోసెలివ్కా, నోవా క్రుగ్లియాకివ్కా ప్రాంతాల్లో క్షిపణి దాడులు జరిగినట్లు 'ఉక్రిఇన్ఫాం' వివరించింది. ఆదివారం ఉదయం రష్యా సరిహద్దులకు వెయ్యి కిలోమీటర్ల దూరంలో ఉండే సుమీ రీజియన్‌లోని ఒలెక్సివ్కాలోని ఉక్రెయిన్ గ్రౌండ్ ఫోర్సెసపై దాడులు జరిగాయని పేర్కొంది. ఈ దాడుల్లో 12 మంది సైనికులు మృతిచెందగా.. మరో 60 మంది క్షతగాత్రులైనట్లు తెలిపింది. ఇదిలా ఉండగా, సోమవారం ఇస్తాంబుల్‌లో జరగనున్న శాంతి చర్చల కోసం తమ ప్రతినిధులు వెళ్తారని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు.

# ఫుట్‌బాల్ అభిమానుల వేడుకలు హింసాత్మకం

## పారిస్‌లో ఇద్దరి మృతి.. 200 మందికి గాయాలు

పారిస్, జూన్ 1: ఫ్రాన్స్‌లో చాంపియన్స్ లీగ్ ఫుట్‌బాల్ అభిమానుల విజయోత్సవ వేడుకలు హింసాత్మకంగా మారాయి. రాజధాని పారిస్ వీధులు శనివారం రాత్రి అల్లర్లతో అట్టుడికాయి. ఫుట్‌బాల్ చాంపియన్స్ లీగ్ ఫైనల్‌లో ఇంటర్ మిలన్ జట్టుపై పారిస్ సెయింట్ జర్మైన్(పీఎసజీ) క్లబ్ గెలవడంతో వేలాది మంది అభిమానులు పారిసలో సంబరాల్లో మునిగిపోయారు. ఈ నేపథ్యంలోనే ప్రత్యర్థి జట్టు అభిమానులకు పీఎసజీ అభిమానులకు పలుచోట్ల వాగ్వాదాలు చోటుచేసుకుని తీవ్ర ఘర్షణలకు దారి తీశాయి. ఘర్షణల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని.. 21 మంది పోలీసులు సహా 200 మందికి పైగా గాయపడ్డారని ఫ్రాన్స్ అంతర్గత వ్యవహారాల శాఖ తెలిపింది. 559 మందిని పోలీసులు అరెస్టు చేశారని పేర్కొంది.




# భద్రాచలం దేవస్థానంలో అన్యమత ప్రచారం

## వస్త్రాల కౌంటర్‌లో సంచిపై అన్యమత వాక్యాలు

**భద్రాచలం, జూన్ 1 :** భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలోని శేష వస్త్రాల విక్రయ కౌంటర్‌లో అన్యమత ప్రచారం జరగడం కలకలం రేపుతోంది. వస్త్రాలు కొనుగోలు చేసే భక్తులకు ఇచ్చిన సంచిపై అన్యమతానికి చెందిన వాక్యాలు ఉండటం వివాదానికి కారణమైంది. గుంటూరుకు చెందిన మేళ్లచెరువు జనార్దనరావు అనే భక్తుడు ఆదివారం తమ కుటుంబ సభ్యులతో సీతారామచంద్రుల దర్శనం చేసుకున్నారు. శేష వస్త్రాల విక్రయ కౌంటర్‌లో రెండు చీరలతో పాటు ఇతర వస్త్రాలను కొనుగోలు చేశారు. కౌంటర్ నిర్వాహకులు వస్త్రాలను పెట్టి ఇచ్చిన సంచులపై అన్యమతానికి సంబంధించిన వాక్యాలు ముద్రించి ఉండటంతో జనార్ధనరావు కుటుంబసభ్యులు అవాక్కయ్యారు.

ఈ ఘటనపై భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవికి లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. ఘటన దురదృష్టకరమని, దేవస్థానంలో అన్యమత ప్రచారం జరకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. దీంతో ఈవో తమ సిబ్బందితో వెళ్లి తనిఖీలు నిర్వహించారు. కౌంటర్‌లో మరికొన్ని అన్యమత ప్రచార సంచులు కూడా లభ్యమైనట్లు సమాచారం. దీంతో కాంట్రాక్టరు ఎస్‌వీసీహెచ్ సుబ్బారావుకు నోటీసు జారీ చేసి 24 గంటలలో వివరణ ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిసింది.



# 625 మంది పోలీసులకు పతకాలు

రాష్ట్ర అవతరణ దినోత్సవాల సందర్భంగా 625 మంది ప్రతిభావంతులైన పోలీసులకు సేవా పతకాలను ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో 461 సేవా పతకాలు, 92 ఉత్తమ సేవా పతకాలు, 16 మహోన్నత సేవా పతకాలు, 47 కఠిన సేవా పతకాలు, 9 శౌర్య పతకాలు ఉన్నాయి. గ్రేహౌండ్స్ విభాగానికి చెందిన 9మందికి శౌర్య పతకాలు లభించాయి. 22 మంది అవినీతి నిరోధకశాఖ అధికారులకు, ఆరుగురు విజిలెన్స్ సిబ్బందికి పతకాలు ప్రకటించారు.

**కోయభాషలో ఆహ్వాన పత్రికలు**

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని ప్రముఖులు, వివిధ శాఖల అధికారులను ఆహ్వానించేందుకు కోయభాషలో ఆహ్వాన పత్రాలను ముద్రించారు. గిరిజన సంస్కృతి సంప్రదాయాలు, భాష అంతరించి పోకుండా, నేటి తరానికి అవగాహన కల్పించే లక్ష్యంతో కోయభాషను తెలుగులిపిలో ముద్రించామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ చెప్పారు.





# విశాలమైన గోశాలకు స్థల సేకరణ చేయండి

## ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన

**జనతా న్యూస్ వేములవాడ :** విదేశీ పర్యటన ముగించుకొని ముఖ్యమంత్రి రవీందర్ రెడ్డిని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆరోగ్యంతో మరణించిన గోవులకు సంబంధించి ఆది శ్రీనివాస్ ముఖ్యమంత్రితో చర్చించారు.రాజరాజేశ్వర స్వామికి మొక్కుబడిగా వచ్చిన కోడల్ని తిప్పాపురం లో గల గోశాలలో ఉంచుతారు ఇట్టి కోడల్ని అర్హత గల రైతులకు ప్రతి మూడు నెలలకు ఒకసారి ఉచితంగా పంపిణీ చేస్తారు ఈ మధ్యకాలంలో పంపిణీ చేయకపోవడం వల్ల 500 గోవులు ఉండే గోశాలలో సుమారుగా 1200 ఉ ఒడడం వలన అందులోని కొన్ని గోవులు అనారోగ్యం పాలు అయ్యి మరణించడం జరిగింది ఇట్టి విషయాన్ని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం వలన గోవుల సంరక్షణ కోసం విశాలమైన స్థలాన్ని సేకరించి గోశాలను ఏర్పాటు చేయవలసినదిగా సూచించినారు

# ఆత్మహత్య చేసుకుంటానని వాటర్ ట్యాంక్ ఎక్కిన యువకుడికి కౌన్సిలింగ్




కరీంనగర్, జనతా న్యూస్: గ్రామంలోని వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించిన యువకుడికి కౌన్సిలింగ్ నిర్వహించి అతని ప్రాణాలను కానిస్టేబుల్ రక్షించిన సంఘటన ఆదివారం నాడు జరిగింది. వివరాలు ఇలా ఉ న్నాయి. కొత్తపల్లి మండలం బావుపేటకు చెందిన నేరెళ్ల సన్నీ అలియాస్ దయాసాగర్ కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. అనంతరం తన ఉన్మాద చర్యలకు పాల్పడి ఇంట్లోని వస్తువులను చిల్లర వందర చేయడంతో పాటు కుటుంబ సభ్యులపై దాడికి దిగాడు. అనంతరం తన కుటుంబ సభ్యుల చర్యలను నిరసిస్తూ గ్రామంలోని వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. కానిస్టేబుల్ విజయరావు డయల్ 100 ద్వారా సమాచారం అందుకుని అక్కడకు చేరుకున్నాడు. వాటర్ ట్యాంక్ ఎక్కిన సన్నితో మాట్లాడుతూ కౌన్సిలింగ్ నిర్వహించారు. సన్నీ షరతులకు అనుగుణంగా కుటుంబ సభ్యులను ఒప్పించి వాటర్ ట్యాంక్ దింపి అతని ప్రాణాలను రక్షించడంతోపాటు కుటుంబ సభ్యుల మధ్య ఏర్పడిన గొడవలను సద్దు మణిగించేందుకు వారితో కొన్ని ఒప్పందాలు చేయించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. వాటర్ ట్యాంక్ ఎక్కి బెదిరింపులకు పాల్పడిన యువకుడికి కౌన్సిలింగ్ నిర్వహించి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్ విజయ రావు ను కరీంనగర్ రూరల్ ఏసిపి శుభం ప్రకాష్ నగ్రాల సిఐ ఏ నిరంజన్ రెడ్డి, కొత్తపల్లి ఎస్ఐ ఎస్ సాంబమూర్తిలు అభినందించారు

# "ప్రభుత్వ నిర్లక్ష్యంతో జరిగిన హత్య

## డా. శ్రవణ్ దాసోజు, ఎమ్మెల్సీ



**బాలానగర్ :** బాలానగర్‌లో అరుణ, నవజాత శిశువు మృతిని "ప్రభుత్వ నిర్లక్ష్యంతో జరిగిన హత్య"గా ఖండించిన డా. శ్రవణ్ దాసోజు "హైదరాబాద్ బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చోటుచేసుకున్న అరుణ (22) అనే యువతీ, ఆమె పుట్టిన శిశువు మరణం సంఘటన పట్ల నాకు తీరని బాధ, తీవ్ర ఆగ్రహం కలిగాయి. ఇది కేవలం వైద్య నిర్లక్ష్యం కాదు ౦ ఇది ఓ విఫలమైన వ్యవస్థ చేత పనిచేయించబడుతున్న, చల్లగా సాగిన ప్రభుత్వ హత్య," అని ఎమ్మెల్సీ డా. శ్రవణ్ దాసోజు తీవ్రంగా వ్యాఖ్యానించారు. అరుణ ప్రసవం కోసం PHCకి వచ్చినప్పుడు అక్కడ డాక్టర్ గారు లేరు. డెలివరీని నర్సులు మరియు ANM సిబ్బంది నిర్వహించారు. డెలివరీ అనంతరం శిశువు స్పందించకపోవడంతో, నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ డాక్టర్లు శిశువు అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. అరుణ పరిస్థితి విషమించడంతో గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో ఆమె కూడా మరణించింది. "ఇది యాదృచ్ఛికం కాదు. ఇది ప్రభుత్వ ప్రమేయంతో సాగుతున్న ఖచ్చితమైన నిర్లక్ష్యం. ప్రాణాలు ఆధారపడే పరిస్థితుల్లో ఓ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ లేకుండా పనిచేస్తున్నదంటే ఇది నేరమే. ఓ యువ తల్లి, బిడ్డ మృత్యువాత పడుతుంటే ప్రభుత్వం ఎక్కడ ఉంది?" అని డా. శ్రవణ్ ప్రశ్నించారు. ప్రభుత్వం అందాల పోటీలు, ప్రకటనలు, ప్రాచుర్య కార్యక్రమాలతో విహరిస్తున్న తరుణంలో సామాన్య ప్రజలు ప్రాథమిక వైద్య సేవలు లేక చనిపోతున్నారు. ఇది అధికారుల ప్రజలతో సంబంధం పూర్తిగా తెగిపోయిందనే ఘోర సాక్ష్యం. "ఇది పాలన వైఫల్యం మాత్రమే కాదు ౦ ఇది మానవతా విలువలపై, జీవించే హక్కుపై దారుణమైన దాడి. ఈ ఘాతకానికి ప్రభుత్వం నైతికంగా, చట్టపరంగా పూర్తిగా బాధ్యత వహించాలి," అని డా. శ్రవణ్ డిమాండ్ చేశారు.


# వేములవాడ రాజన్న ఆలయ గోశాల నిర్వహణలో నిర్లక్ష్యం

## కోడెలు పిట్టల్లా రాలిపోతున్న పట్టింపు లేదా..?

## నిర్లక్ష్యానికి కారణమైన అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి

## వేములవాడ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు






వేములవాడ, జనతా న్యూస్: వేములవాడ రాజన్న ఆలయ గోశాల నిర్వహణలో పూర్తిగా నిర్లక్ష్యం వహించడం ద్వారా కోడెలు పిట్టల రాలిపోయాయని ఇందుకు కారణమైన అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని వేములవాడ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. ఆదివారం ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలో ఎక్కడా చీమ చిటిక్కుమన్న మాట్లాడే స్థానిక శాసన సభ్యుడు ఆది శ్రీనివాస్ కోడెల మృత్యువాత పడుతున్న ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. గత ఆరు మాసాల క్రితం మంత్రి కొండా సురేఖ ఇచ్చిన సిఫారసు లేక తో ఒకరికి 60 కోడేలు కేటాయించడం ద్వారా ఈ పంపిణీ ఆగిపోయిన విషయం తెలిసిందే అని చెప్పారు. తెలంగాణలోనే ఇంట్లో శుభకార్యం జరిగిన ముందుగా రాజన్నకు మొక్కులు చెల్లించుకునే ఆనవాయితీలో భాగంగా ప్రతినిత్యం స్వామివారికి కోడెలు సమర్పిస్తున్నారని తెలిపారు. మరో వైపు గుడి బంద్ చేస్తారన్న ప్రచారంలో భాగంగా భక్తులు ప్రతినిత్యం వేలాదిగా తరలివస్తూ అత్యంత ప్రీతిపాత్రమైన స్వామివారికి నిజకోడెను కూడా భక్తులు సమర్పించుకుంటున్నారని తెలిపారు. ఆరు మాసాలుగా కోడెల పంపిణీ ప్రక్రియ నిలిచిపోగా, దీంతో తిప్పాపూర్ గోశాలలో కేవలం 500 కోడెలు మాత్రమే ఉంచే స్థలంలో 1200 కు పైగా కోడెలను ఉంచడం ద్వారా అనారోగ్యం బారిన పడి సరియైన ఆహారం అందక మృత్యువాత పడుతున్నాయన్నారు.

సాక్షాత్తు పశు వైద్యాధికారులే నిర్ధారించడం దురదృష్టకరమన్నారు. స్వామివారికి అత్యంత ప్రతిపాత్రమైన కోడె ముక్కు ద్వారా సాలిన 22 కోట్ల ఆదాయం వస్తుండగా కనీసం వాటికి ఆహారం పెట్టలేని దుస్థితిలో రాజన్న ఆలయ అధికారులు ఈ ప్రభుత్వం ఉండడం దురదృష్టకరం అన్నారు.

500 చోట 1200 కు పైగా కోడేలు ఉండడం కనీస ఆహారం లేక మృతి చెందడం లో అధికారులకు నాయకులకు కనీస మానవత్వం కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

అసలు రాజన్న కోడెలకు ఎంతమంది సిబ్బంది పని చేస్తున్నారు, ఏమైనా వైద్య సదుపాయాలు కల్పించి మందులు కొనుగోలు చేశారా మీ దగ్గర ఏమైనా ఆధారాలు ఉన్నాయా అని ప్రశ్నించారు.ల చనిపోయిన తర్వాత మాత్రమే అధికారులు హడావిడి చేస్తూ పంపిణికి సిద్ధమవుతున్నట్లు కలెక్టర్ ప్రకటన చేస్తున్నారు. గతంలో జరిగిన అవకతవకలను దృష్టిలో పెట్టుకొని తప్పనిసరిగా పకడ్బందీగా పంపిణీ జరగాలని సూచించారు. ఇకపై రాజన్న కోడెలకు శాశ్వత పరిష్కారంగా 50 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసి వాటిని కాపాడి భక్తుల మనోభావాలను గౌరవించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే భక్తుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

రాజస్థాన్ ప్రాంతంలో 2వేల ఎకరాల్లో 1లక్ష 50 వేల కోడెలను సంరక్షిస్తున్నారని అక్కడిలాంటి ప్రదేశాలకు వెళ్లి అధ్యాయనం చేసి కాపాడాలని సూచించారు.

# యాదగిరిగుట్ట క్షేత్రం.. భక్తజన సంద్రం

## ధర్మదర్శనానికి 4 గంటలు, స్పెషల్ దర్శనానికి గంటన్నర సమయం

## సండే స్వామివారిని దర్శించుకున్న 90 వేల మంది భక్తులు

## ఆదివారం ఆలయ ఖజానాకు రూ.79.51 లక్షల ఆదాయం

## గుండంలో నీటిశుభ్రత లోపించినందున ఇంఛార్జ్ పై సస్పెన్షన్ వేటు

## శానిటేషన్ పనులపై అసంతృప్తి, ఆఫీసర్లపై ఈవో సీనియస్







**యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆదివారం భక్తులు పోటెత్తింది. సమ్మర్ హాలీడేస్ కు సండే తోడు కావడంతో.. రాష్ట్ర నలుమూలల నుండి ఆలయానికి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. దీంతో యాదగిరిగుట్ట నారసింహుడి క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. ఆలయ పరిసరాల్లో ఎక్కడ చూసినా భక్తుల కోలాహలం, భక్తజనుల సందోహమే కనిపించింది. కొండపైన, కింద ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరి శాయి. రద్దీ కారణంగా స్వామివారి దర్శనం కోసం భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో నిరీక్షించాల్సి వచ్చిం ది. నారసింహుడి ధర్మదర్శనానికి నాలుగు గంటలు, స్పెషల్ దర్శనానికి గంటన్నర సమయం పట్టిందని భక్తులు తెలిపారు. పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తుల కారణంగా కల్యాణకట్ట, లక్ష్మీపుష్కరిణి, వ్రత మండపాలు, పార్కింగ్ ప్రదేశం, బస్ బే ఏరియా, దర్శన, ప్రసాద క్యూలైన్లు, ప్రధానాలయ ప్రాంగణ పరిసరాలు కిటకిటలాడాయి. భక్తులు అధిక సంఖ్యలో వచ్చిన భక్తులకు సంబంధించిన సొంత వాహనాలతో కొండపైన, కిందా పార్కింగ్ ప్రదేశాలు నిండిపోవడంతో.. దీంతో రింగు రోడ్డు వెంట వాహనాలను పార్కింగ్ చేశారు. ట్రాఫిక్ ను కంట్రోల్ చేయడానికి ట్రాఫిక్ పోలీసులు అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. భక్తుల వాహనాలతో కొండపైన బస్ బే నిండిపోవడంతో.. కొండపైకి వాహనాలను నిలిపివేశారు. ఇక ఆలయంలో నిర్వహించిన స్వామివారి నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహ హోమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

**నారసింహుడిని దర్శించుకున్న 90 వేల మంది భక్తులు**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనారసింహుడిని ఆదివారం దాదాపుగా 90 వేల మంది భక్తులు దర్శించుకున్నారని ఆలయ వర్గాలు వెల్లడించాయి. రద్దీ కారణంగా తెల్లవారు జామున నుండి రాత్రి గుడి మూసేవరకు నిరంతరంగా స్వామివారి దర్శనాలు కొనసాగాయని పేర్కొన్నారు. రద్దీ పెద్దస్థాయిలో ఉన్నా చాలా మంది భక్తులు ఉచిత దర్శనం ద్వారా స్వామివారిని దర్శించుకోగా.. స్వామివారి దర్శనం తొందరగా కావడానికి కొందరు భక్తులు వీఐపీ, బ్రేక్ దర్శనాలను ఆశ్రయించారు. రూ. 150ల వీఐపీ టికెట్ల ద్వారా 14,200 వేల మంది భక్తులు, రూ. 300ల బ్రేక్ దర్శన టికెట్ల ద్వారా 2,617 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

**లక్ష్మీపుష్కరిణి ఇంఛార్జ్ వెంకటేష్ సస్పెండ్**

విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న లక్ష్మీపుష్కరిణి శానిటేషన్ ఇంఛార్జ్ బూడిద వెంకటేష్ పై సస్పెన్షన్ వేటు పడింది. ఆదివారం ఆలయ ఈవో వెంకటరావు కొండ కింద ఉన్న లక్ష్మీపుష్కరిణిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గుండంలో వాటర్ గ్రీన్ కలర్ లోకి మారి దుర్వాసన వస్తుండడం, గుండం ఏరియా మొత్తం అపరిశుభ్రంగా ఉండడంతో.. పుష్కరిణి శానిటేషన్ ఇంఛార్జ్ బూడిద వెంకటేష్ ను ఈవో వెంకటరావు సస్పెండ్ చేశారు. భక్తులకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. లక్ష్మీపుష్కరిణితో పాటు అద్దెగదులు, కల్యాణకట్ట, పారిశుధ్య పనులను పరిశీలించారు. కొన్ని గదుల్లో వాటర్ లీకేజీలు గమనించిన ఈవో.. సంబంధిత అధికారులను పిలిచి మరమ్మత్తులు చేయాలని సూచించారు. అద్దెగదుల పరిసరాలలో అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. శానిటేషన్ విభాగం చూస్తున్న ఆలయ అధికారులకు ఫోన్ చేసి మందలించారు. శానిటేషన్ నిర్వహణలో లోపాలను సరిచేసుకోవాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం మల్లాపూర్ లో దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న గోశాలను సందర్శించారు. గోశాల రికార్డులను చెక్ చేసిన ఈవో.. గోవులకు పశుగ్రాసంగా ఇస్తున్న దానా, ఎండుగడ్డి నాణ్యతను పరిశీలించారు. తర్వాత కొండపైన ఆలయ మాడవీధులు, క్యూలైన్లు, క్యూకాంప్లెక్స్ లో తాగునీటి సౌకర్యం ఫ్యాన్లు, ఏసీల పనితీరును పరిశీలించారు. అనంతరం భక్తులతో స్వయంగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఆలయ అధికారులకు సూచించారు.


**స్వామివారి సేవలో ఏపీ హైకోర్టు జడ్జి**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని ఆదివారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ సుబ్బారావు దర్శించుకున్నారు. ఫ్యామిలీతో కలిసి గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వచన మండపంలో అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం చేయగా.. ఈవో వెంకటరావు లడ్డూప్రసాదం, స్వామివారి శేషవస్త్రాలు అందజేశారు.

**కోర్కెలు తీర్చే నారసింహుడికి కాసుల వర్షం**

నారసింహుడి దర్శనం కోసం తండోపతండాలుగా తరలివచ్చిన భక్తులు జరిపించిన పలు రకాల పూజల ద్వారా ఆదివారం ఆలయానికి కాసుల వర్షం కురిసింది. భక్తుల పూజలతో ఆలయ ఖజానాకు భారీగా ఆదాయం సమకూరింది. భక్తులు జరిపించిన పలు రకాల పూజలు, నిత్య కైంకర్యాల ద్వారా ఆదివారం ఆలయానికి రూ. 79,51,701 ఆదాయం సమకూరింది. అత్యధికంగా ప్రసాద విక్రయం ద్వారా రూ. 24,71,630, వీఐపీ దర్శనాల ద్వారా రూ. 21.30 లక్షలు, ప్రధాన బుకింగ్ తో రూ. 3,21,400, కొండపైకి వాహనాల ప్రవేశంతో రూ. 8,70,500, బ్రేక్ దర్శనాల ద్వారా రూ. 7,85,100, యాదరిషి నిలయం ద్వారా రూ. 4,36,282, సత్యనారాయణస్వామి వ్రతాలతో రూ. 2,39,200 లక్షలు, కల్యాణకట్ట ద్వారా రూ. 2 లక్షల ఇన్ కమ్ వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. కాగా ఆదివారం 4 వేల మంది భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

# పదే పదే కడగకూడదా



మన శరీరంలో కొన్ని భాగాలు చాలా సున్నితంగా ఉంటాయి. పరిశుభ్రత పేరుతో వాటిని పదేపదే కడిగితే అనారోగ్య సమస్యలు తప్పవంటున్నారు నిపుణులు.

కొంతమంది... జిడ్డుగా ఉందనో మొటిమలు వస్తున్నాయనో ముఖాన్ని పదే పదే సబ్బుతో రుద్ది కడుగుతూ ఉంటారు. దీనివల్ల ముఖం మీద ఉండే సహజ నూనెలు తొలగిపోయి చర్మం పొడిబారుతుంది. ముఖం మృదుత్వాన్ని కోల్పోతుంది. ముఖాన్ని రోజుకు మూడుసార్ల కంటే ఎక్కువగా కడగకూడదు. ముక్కులోపలి భాగాన్ని కూడా ఎక్కువగా శుభ్రం చేయకూడదు. ఇక్కడ.... లోపలికి ప్రవేశించే గాలిని శుభ్రపరచి చుట్టూ తేమగా ఉంచే పొర ఉంటుంది. ముక్కును ఎక్కువగా నీళ్లతో శుభ్రం చేస్తూ ఉంటే ఈ పొర దెబ్బతింటుంది. దీంతో దుమ్ము కణాలు శ్వాస నాళాల్లోకి చేరి తుమ్ములు, దగ్గు లాంటి శ్వాసకోశ సమస్యలను కలిగిస్తాయి. కంటి చుట్టూ నల్లని వలయాలు వచ్చాయని, వేళ్ల మధ్య మురికి చేరిందని ఆ ప్రదేశాలను అతిగా రుద్దకూడదు. ఈ భాగాల్లో చర్మం చాలా సున్నితంగా ఉంటుంది. శుభ్రత పేరుతో మాటిమాటికీ సబ్బుతో కడుగుతూ ఉంటే చర్మం పొరలు బలహీనమై ఇన్ఫెక్షన్లు సోకవచ్చు. జననేంద్రియాలను కూడా సబ్బు లేదా షాంపూతో పదేపదే శుభ్రం చేయకూడదు. అలా చేస్తే ఆ భాగాల్లోని పీహెచ్ స్థాయిలు దెబ్బతిని దురద, మంట లాంటి సమస్యలు ఏర్పడవచ్చు. గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకుంటే చాలు.

# వాతావరణ మార్పులకు ఇలా



ఏడాది పొడవునా వాతావరణ మార్పులు సహజం. ఈ మార్పులకు శరీరం సన్నద్ధమయ్యేలా జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్య సమస్యలు రావు. ఆ జాగ్రత్తలు ఇవే...

వాతావరణంలో ఏర్పడే అత్యధిక, అత్యల్ప ఉష్ణోగ్రతల కారణంగా శరీరానికి నీటి అవసరం పెరుగుతూ తరుగుతూ ఉంటుంది. కాలానికి అనుగుణంగా తరచూ మంచినీరు తాగుతూ ఉంటే నీర్జలీకరణ సమస్యలనుంచి బయటపడవచ్చు. ఎండ, వాన, చలి తీవ్రతలను దృష్టిలో ఉంచుకుని దుస్తులు ధరించాలి. వడగాలి, వర్షం, చలిగాలి బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

వాతావరణ మార్పుల వల్ల తరచూ వ్యాధులు సోకుతుంటాయి. కాలానుగుణంగా లభించే పండ్లు, కూరగాయలు, ఆకుకూరలను ఆహారంలో చేర్చుకోవాలి. అప్పుడే రోగనిరోధకశక్తి పెరుగుతుంది. విటమిన్లు, ప్రొటీన్లు, మినరల్స్, పీచుపదార్థాలతో కూడిన ఆహారం తీసుకోవాలి. దీనివల్ల హానికారక వైరస్‌లు, బ్యాక్టీరియాల నుంచి రక్షణలభిస్తుంది. ఎటువంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా క్రమం తప్పకుండా వ్యాయామం లేదా యోగ, ధ్యానం చేయాలి. వీటివల్ల శారీరక దారుఢ్యం పెరుగుతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. నడక కూడా మంచిదే. నిద్రకు ప్రాధాన్యం ఇవ్వాలి. రోజుకు కనీసం ఎనిమిది గంటలు నిద్రించడం మంచిది. స్వచ్ఛమైన గాలి, ప్రశాంతమైన పరిసరాలు, తేలికపాటి భోజనం లాంటివి నిద్ర సమస్యలను దూరం చేస్తాయి. నీరసం, జీర్ణ సమస్యలు, దగ్గు, జలుబు, జ్వరం, విరేచనాలు, తలనొప్పి లాంటి సమస్యలు వస్తే వైద్యుని సంప్రదించాలి. తగినంత విశ్రాంతి తీసుకోవాలి.

# బీపీ కంట్రోల్ కావాలంటే..

## ఈ 5 అలవాట్లను వెంటనే మానేయండి..!



సాధారణంగా అధిక రక్తపోటును "నిశ్శబ్ద హంతకుడు" అని పిలుస్తారు. ఎందుకంటే హై బీపీ ఎక్కువగా గుండె, మెదడు లేదా మూత్రపిండాలకు గణనీయమైన హాని కలిగిస్తుంది. ప్రాణాంతక పరిస్థితి వచ్చే వరకూ లక్షణాలు గుర్తించడం కష్టం. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (%×జవీ=%) ప్రకారం, భారతదేశంలో పెద్దవయసువారిలో 25% కంటే ఎక్కువ మందికి అధిక రక్తపోటు ఉంది. వంశపారంపర్యం, వయస్సుతో పాటు ఆహారపు అలవాట్లు, రోజువారీ జీవనశైలి శరీరంలో రక్తపోటు స్థాయిలను ప్రభావితం చేస్తాయి. ప్రధానంగా ఈ కొన్ని అలవాట్ల వల్ల వ్యక్తి జీవనకాలం పడిపోతుంది. చిన్నవయసులోనే హార్ట్ స్ట్రోక్, గుండె సంబంధిత సమస్యలు, కిడ్నీ వ్యాధులు అటాక్ చేయవచ్చు. కాబట్టి, ఆ అలవాట్లు ఏవో తెలుసుకుంటే ఈ సమస్యలు రాకుండా నివారించవచ్చు.

ధమని గోడలపై రక్తం ఒత్తిడి ఉంటుంది. దీన్నే రక్తపోటు అంటారు. ఇది ఎల్లప్పుడూ ఎక్కువగా ఉంటే గుండె, రక్త నాళాలు సాధారణం కంటే ఎక్కువగా పనిచేయవలసి ఉంటుంది. ఇలా జరిగితే అవయవాలు వేగంగా దెబ్బతింటాయి. తినే విధానం మొదలుకుని ఒత్తిడిని నిర్వహణ వరకూ దైనందిన జీవితంలో మనం చేసే చాలా పనులూ బీపీ పెరుగుదలకు కారణమవుతాయి.

**అధిక ఉప్పు**

అధిక సోడియం అధిక రక్తపోటుకు ప్రధాన కారణాలలో ఒకటి. ప్రాసెస్ చేసిన ఆహారాలు, ఇన్‌స్టంట్ నూడుల్స్, ప్యాక్ చేసిన ఆహారాలు, రెస్టారెంట్ భోజనం అధిక ఉప్పుతో నిండి ఉంటాయి. ఉప్పగా ఉండే ఆహారాలను తగ్గించడం, ఆహార లేబుళ్ళను తనిఖీ చేసి కొనుగోలు చేస్తే అధిక ఉప్పు సమస్య తగ్గించుకోవచ్చు.

**శారీరక శ్రమ**

నిశ్చల జీవనశైలి అంటే రోజులో చాలాసేపు శారీరక శ్రమకు దూరంగా ఉండటం వల్ల మీ జీవక్రియ మందగిస్తుంది. ఆ ప్రభావంతో బరువు పెరుగుతారు. ఈ రెండూ కూడా అధిక రక్తపోటుకు దారితీస్తాయి. కాబట్టి, మీ దినచర్యలో 30 నిమిషాల పాటు చురుకైన నడక కోసం కేటాయించండి. ఈ చిన్నపాటి మార్పులు కూడా రక్తపోటును అదుపులో ఉంచి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి.

**కెఫీన్**

కాఫీని మితంగా తీసుకోవడం అందరికీ హాని కలిగించకపోయినా రోజుకు అనేక సార్లు కాఫీ, టీ లేదా ఎనర్జీ డ్రింక్స్ తీసుకోవడం వల్ల రక్తపోటు తాత్కాలికంగా పెరుగుతుంది. అప్పటికే అధిక రక్తపోటు ఉన్న వ్యక్తులకు ఈ అలవాటు ఇంకా ప్రమాదకరం.

**నిద్ర**

తగినంత లేదా క్రమరహిత నిద్ర విధానాలు హార్మోన్ నియంత్రణ, ఒత్తిడి ప్రతిస్పందనకు అంతరాయం కలిగిస్తాయి. ఈ రెండూ రక్తపోటును పెంచుతాయి. అంతరాయం లేకుండా ప్రతి రాత్రి 7%-%8 గంటలు నిద్రపోండి. క్రమం తప్పకుండా ఒకే నిద్ర షెడ్యూల్‌ను పాటించండి.



**దీర్ఘకాలిక ఒత్తిడి**

దీర్ఘకాలిక ఒత్తిడిని నియంత్రించకపోతే కాలక్రమేణా రక్తపోటు తీవ్రసమస్యగా మారుతుంది. కార్టిసాల్ వంటి హార్మోన్లను విడుదలై తాత్కాలికంగా రక్తపోటును మరింత పెంచుతుంది. దీర్ఘ శ్వాస, వ్యాయామాలు లేదా సన్నిహితులతో సరదాగా గడపడం లాంటి పనుల ద్వారా ఒత్తిడి నియంత్రణ కోసం ప్రయత్నాలు చేయాలి.

మనం తీసుకునే ఆహారం, నిద్రపోవడం లేదా ఒత్తిడిని ఎలా ఎదుర్కోవడం వంటి మన రోజువారీ ఎంపికలు మన హృదయనాళ వ్యవస్థను నిశ్శబ్దంగా దెబ్బతీస్తాయని మనలో చాలా మందికి తెలియదు. అధిక రక్తపోటుకు కారణమయ్యే ఈ అంశాలను గుర్తించడం నివారణకు మొదటి అడుగు. అత్యంత దారుణమైన సందర్భాల్లో హై బీపీ రోగుల్లో రక్త ప్రవాహాన్ని పునరుద్ధరించడానికి యాంజియోప్లాస్టీ లేదా బైపాస్ సర్జరీ అవసరం కావచ్చు లేదా మూత్రపిండాలు గణనీయంగా దెబ్బతిన్నట్లయితే డయాలసిస్ కూడా అవసరం కావచ్చు.

సమతుల్య ఆహారం, రోజువారీ శారీరక వ్యాయామం, ఒత్తిడి నిర్వహణ వ్యూహాలు అనుసరిస్తూ రక్తపోటును క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని వైద్యులు సిఫార్సు చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల గుండెపోటు, స్ట్రోక్ లేదా మూత్రపిండాల వైఫల్య ప్రమాదాన్ని తగ్గుతుంది. జీవనశైలి మార్పులు సరిపోకపోతే మందులు, తదుపరి జాగ్రత్తల కోసం వైద్యుడిని సంప్రదించండి. సాధారణ అలవాట్లతో మీ ఆరోగ్యాన్ని చేజేతులా నిశ్శబ్దంగా నాశనం చేసుకోకండి.

# మధుమేహం ఉన్నవారు రోజు ఎంతసేపు నడవాలి..



డయాబెటిస్ వేగంగా పెరుగుతున్న తీవ్రమైన ఆరోగ్య సమస్య, దాదాపు అన్ని వయసుల వారికి ఈ వ్యాధి వచ్చే ప్రమాదం ఉంది. రక్తంలో చక్కెర పెరగడం వల్ల కలిగే మధుమేహానికి సకాలంలో చికిత్స చేయకపోతే అది ఇతర ఆరోగ్య సమస్యల ప్రమాదానికి దారితీస్తుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు.

**30-45 నిమిషాలు**

శారీరక శ్రమతో మధుమేహం, గుండె జబ్బులు వంటి దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించవచ్చని పరిశోధకులు అంటున్నారు. మీరు క్రమం తప్పకుండా నడక వంటి వ్యాయామాలు చేస్తే అది మీ రక్తంలో చక్కెరను నియంత్రించడంలో కూడా సహాయపడుతుంది. మధుమేహాన్ని నిర్వహించడానికి ప్రతిరోజూ నడవడం అలవాటు చేసుకోవడం చాలా ప్రయోజనకరంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ప్రతిరోజూ 30-45 నిమిషాలు నడవడం అలవాటు చేసుకోవడం వల్ల మీపై సానుకూల ప్రభావాలు ఉంటాయని అంటున్నారు.

**10,000 అడుగులు**

డయాబెటిస్ ఉన్నవారు రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించడానికి ఆహారంతో పాటు నడక కూడా చాలా అవసరం అంటున్నారు. ప్రతిరోజూ దాదాపు 10,000 అడుగులు నడవడం అనే అలవాటు ఆరోగ్యానికి మంచిదని చెబుతున్నారు. ఇది మధుమేహాన్ని నియంత్రించడంలో సహాయపడటమే కాకుండా గుండె జబ్బులు, జీవక్రియ సమస్యలు వంటి అనేక ఇతర దీర్ఘకాలిక వ్యాధులను తగ్గించడంలో కూడా ప్రయోజనకరంగా ఉంటుంది.

**2050 నాటికి..**

జీవనశైలిలో మార్పుల కారణంగా అన్ని వయసుల వారిలో డయాబెటిస్ వచ్చే ప్రమాదం కనిపిస్తోందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. డయాబెటిస్ కేసులు పెరుగుతున్న వేగాన్ని బట్టి చూస్తే, 2050 నాటికి ప్రపంచవ్యాప్తంగా డయాబెటిస్ కేసుల సంఖ్య 130 కోట్లు దాటే అవకాశం ఉందని పరిశోధకులు ఆందోళన వ్యక్తం చేశారు . మధుమేహం కారణంగా, శరీరంలోని అనేక ఇతర భాగాలు ప్రభావితమవుతాయి, కాబట్టి ఈ సమస్యను నియంత్రించడానికి ప్రయత్నిస్తూ ఉండటం చాలా ముఖ్యం.

# గుండె ఆరోగ్యాన్ని కాపాడే 7 ఆయుర్వేద చిట్కాలు..



గుండె లేదా హృదయం మన శరీరానికి రక్తాన్ని పంపిణీ చేసే ఒక ముఖ్యమైన అవయవం. గుండె రక్తాన్ని పంప్ చేస్తూ ఆక్సిజన్, పోషకాలను కణజాలాలకు తీసుకువెళుతుంది. అయితే, మన గుండె ఆరోగ్యంగా ఉండాలంటే మన ధమనులు శుభ్రంగా, రక్త ప్రసరణ సజావుగా జరిగేలా ఉండాలి. ఆయుర్వేదంలో మన ఆరోగ్యాన్ని సహజంగా కాపాడే పద్ధతులు కొన్ని ఉన్నాయి. ధమనులు ఆరోగ్యంగా ఉండాలంటే ఈ 7 ఆయుర్వేద చిట్కాలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం..

**ఆయుర్వేద మూలికలు**

అశ్వగంధ, బ్రాహ్మి, జతమాంసి వంటి ఆయుర్వేద మూలికలు శరీరాన్ని శాంతంగా ఉంచుతాయి. ఇవి ఒత్తిడిని తగ్గించడమే కాక, రక్తపోటును సమతుల్యంలో ఉంచుతాయి.

**ఆముదం**

శరీరంలోని టాక్సిన్లు బయటకు వెళ్లాలంటే ప్రేగు కదలికలు సరిగా ఉండాలి. ఆయుర్వేదంలో దీనికోసం విరేచన విధానం ఉంది. ప్రతిరోజూ కొన్ని పచ్చి బొప్పాయి గింజలు లేదా వారానికి ఒకసారి కొద్దిగా ఆముదం తాగితే శుభ్రత కలుగుతుంది.

**వ్యాయామం**

వ్యాయామం చేయడం వల్ల గుండె బలంగా పనిచేస్తుంది. ఇలా చేస్తే ధమనుల్లో కొవ్వు పేరుకుపోదు. కార్డియో, స్ట్రెచింగ్, బ్రీతింగ్ యాక్టివిటీస్ వంటి వాటిని చేయడం వల్ల మంచి ప్రయోజనం కలుగుతుంది.

**జీర్ణశక్తిని బట్టి తినాలి**

మీ జీర్ణశక్తి బలంగా ఉన్నపుడు, మీరు తినే ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. తద్వారా శరీరంలో కొవ్వు పేరుకుపోదు. అయితే, కేలరీలు ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకుంటే అవి విషపదార్థాలుగా మారి ధమనుల్లో పేరుకుపోతాయి. అందుకే, మీ జీర్ణశక్తిని గుర్తుంచుకుని ఆహారం తీసుకోండి.

**చక్కెర స్థాయిని నియంత్రించండి**

రక్తంలో చక్కెర స్థాయి ఎక్కువగా ఉంటే అది ధమనులకు నష్టాన్ని కలిగిస్తుంది. ఉదాహరణకి, బంగాళదుంపలు కూడా రక్త చక్కెరను వేగంగా పెంచుతాయి. అందుకే, కార్బోహైడ్రేట్లు ఎంత తీసుకోవాలి అనే విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

**ఒత్తిడిని తగ్గించండి**

శరీరంపై ఒత్తిడి ఎక్కువగా ఉంటే రోగనిరోధక శక్తి తగ్గిపోతుంది. దీన్ని నివారిం చేందుకు బ్రాహ్మి, జతమాంసి, శంఖపుష్పి వంటి ఆయుర్వేద మూలికలు సహాయపడతాయి. యోగా, ధ్యానం చేయడం వల్ల మనసు ప్రశాంతంగా ఉంటుంది.

**మంచి దినచర్య**

రోజూ ఒకే సమయానికి లేవడం, తినడం, నిద్రపోవడం వంటివి శరీరానికి శ్రేయస్కరంగా ఉంటాయి. ఈ విధంగా ఆరోగ్యకరమైన దినచర్య పాటిస్తే ధమనులు ఆరోగ్యంగా ఉంటాయి.



## 8న రింకూ నిశ్చితార్థం

జాన్‌పూర్ (యూపీ): సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ప్రియా సరోజ్‌తో క్రికెటర్ రింకూ సింగ్ నిశ్చితార్థం ఈ నెల 8న లఖ్‌నవూలో జరగనుంది. ప్రియ తండ్రి తుఫానీ సరోజ్ ఆదివారం ఈ విషయాన్ని వెల్లడించారు. నవంబరు 18న వారణాసిలోని తాజ్ హెూటల్‌లో వీరి వివాహం జరుగుతుందన్నారు. ఈ వేడుకకు సన్నిహితులను మాత్రమే ఆహ్వానించినట్టు చెప్పారు. ప్రియ, రింకూలకు కొంతకాలంగా పరిచయం ఉందని.. ఇరు కుటుంబాల అంగీకారంతో పెళ్లిని ఫిక్స్ చేసినట్టు సరోజ్ తెలిపారు. 26ఏళ్ల ప్రియ ఉత్తరప్రదేశ్‌లోని మచిలీషహర్ నియోజవర్గం నుంచి తొలిసారి పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. రింకూ అదే రాష్ట్రంలోని అలీగఢ్‌కు చెందినవాడు.

## రెండో రోజు టాపర్ మోహన్

### రూ. 78 లక్షలకు ముంబా వశం
### ముగిసిన ప్రొ కబడ్డీ వేలం

ముంబై: ప్రొ కబడ్డీ లీగ్ వేలం రెండో రోజు అనిల్ మోహన్ అత్యధిక ధర పలికిన ఆటగాడిగా నిలిచాడు. ఆదివారం జరిగిన సి, డి కేటగిరీ ఆటగాళ్ల బిడ్డింగ్‌లో ఆల్‌రౌండర్ మోహన్‌ను యు ముంబా రూ. 78 లక్షలకు కొనుగోలు చేసింది. ఆకాశ్ షిండే (బెంగళూరు), ఉదయ్, నితిన్ రావల్ (జైపూర్) రూ. 50 లక్షల మార్క్ అందుకున్నారు. మొత్తంగా 12వ సీజన్ కోసం రెండు రోజులపాటు జరిగిన వేలంలో నమోదు చేసుకొన్న 529 మంది ఆటగాళ్లలో 121 మంది అమ్ముడయ్యారు. వేలంలో ఇద్దరు ప్లేయర్లే రూ. 2 కోట్ల మార్క్ దాటారు. అత్యధికంగా మహమద్ రెజా రూ. 2.23 కోట్లు పలకగా.. దేవాంక్ దలాల్ రూ. 2.20 కోట్లతో రెండో స్థానంలో నిలిచాడు. కాగా, స్టార్ రైడర్లు పర్‌దీప్ నర్వాల్, సిద్దార్థ్ దేశాయ్ అన్‌సోల్డ్‌గా మిగిలారు.

PRO KABADDI

# ఫైనల్‌కు పంజాబ్..

### ముంబైపై కింగ్స్ ఉత్కంఠ విజయం
### శ్రేయాస్ కెప్టెన్ ఇన్నింగ్స్
### ఈనెల 3న ఆర్‌సీబీతో ఫైనల్ పోరుకు అర్హత



**అహ్మదాబాద్:** ఐపీఎల్-18 సీజన్ ఆసాంతం అద్భుతంగా రాణిస్తున్న పంజాబ్ కింగ్స్ తొలి క్వాలిఫయర్‌లో ఓడినా రెండో క్వాలిఫయర్‌లో అదరగొట్టింది. ఆదివారం అహ్మదాబాద్ వేదికగా ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 5 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించి ఫైనల్‌కు అర్హత సాధించింది. ముంబై నిర్దేశించిన 204 పరుగుల లక్ష్యాన్ని ఆ జట్టు.. 19 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి ఛేదించింది. శ్రేయాస్ అయ్యర్ (41 బంతుల్లో 87నాటౌట్, 5 ఫోర్లు, 8 సిక్సర్లు) కెప్టెన్సీ ఇన్నింగ్స్‌కు తోడు నెహాల్ వధేర (48), జోష్ ఇంగ్లిస్ (38) ఆ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. వరుణుడి ఆటంకంతో రెండు గంటల పాటు ఆలస్యంగా మొదలైన మ్యాచ్‌లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఆ జట్టు.. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 203 పరుగుల భారీ స్కోరు చేసి ప్రత్యర్థి ఎదుట భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. ముంబై జట్టులోని హైదరాబాదీ కుర్రాడు తిలక్ వర్మ (29 బంతుల్లో 44, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకొచ్చి మెరుపులు మెరిపించాడు. సూర్యకుమార్ యాదవ్ (26 బంతుల్లో 44, 4 ఫోర్లు, 3 సిక్సర్లు) మరోసారి రెచ్చిపోగా జానీ బెయిర్ స్టో (24 బంతుల్లో 38, 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), నమన్ ధీర్ (18 బంతుల్లో 37, 7 ఫోర్లు) దూకుడుగా ఆడారు. ఈ విజయంతో పంజాబ్ మంగళవారం రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో టైటిల్ పోరులో అమీతుమీ తేల్చుకోనుంది.

**తిలక్, సూర్య దూకుడు**

టాస్ గెలిచిన పంజాబ్ సారథి శ్రేయాస్ అయ్యర్ మరో ఆలోచన లేకుండా బౌలింగ్ ఎంచుకున్నాడు. ఆరంభంలో పంజాబ్ బౌలర్లు అతడి నమ్మకాన్ని నిలబెట్టినా తర్వాత గతి తప్పారు. గత మ్యాచ్‌లో అర్ధ శతకంతో రాణించిన రోహిత్ శర్మ (8).. పంజాబ్‌తో కీలకపోరులో తేలిపోయాడు. స్టోయినిస్ వేసిన మూడో ఓవర్‌లో అతడు.. విజయ్‌కుమార్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. సాధారణంగా బ్యాటింగ్ ఆర్డర్‌లో నాలుగో స్థానంలో వచ్చే తిలక్‌ను ముంబై.. వ్యూహం మార్చి ముందుగా పంపించింది. జట్టు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని తిలక్ వమ్ముచేయలేదు. ఓపెనర్ బెయిర్ స్టోతో కలిసి ముంబై స్కోరుబోర్డును ఉరకలెత్తించాడు. ఎదుర్కొన్న రెండో బంతినే సిక్సర్‌గా మలిచాడు. అర్ష్‌దీప్ వేసిన మరుసటి ఓవర్‌లో బెయిర్ స్టో రెండు బౌండరీలు రాబట్టాడు. అజ్మతుల్లా ఐదో ఓవర్లో అతడు.. 4, 6తో రెచ్చిపోవడంతో పవర్ ప్లే ముగిసేసరికి ముంబై 65/1గా నిలిచింది. కానీ ఆ తర్వాతి ఓవర్‌లోనే విజయ్‌కుమార్.. బెయిర్ స్టోను ఔట్ చేయడంతో ముంబై రెండో వికెట్ కోల్పోయింది. దీంతో తిలక్‌కు సూర్య జతకలవడంతో ముంబై స్కోరుబోర్డు రాకెట్ వేగాన్ని తలపించింది. ఈ ఇద్దరూ పంజాబ్ బౌలర్లను ఉతికారేస్తూ ఒక్కో ఓవర్‌కు 10 పరుగులు తగ్గకుండా దండుకున్నారు. ఈ జోడీ దూకుడుగా ఆడి 42 బంతుల్లోనే 72 పరుగులు జతచేయడం విశేషం. ప్రమాదకరంగా మారుతున్న ఈ ద్వయాన్ని చాహల్ విడదీశాడు. అతడు వేసిన 14వ ఓవర్లో సూర్య.. 4, 6 బాదినా ఐదో బంతికి వధేరకు క్యాచ్ ఇచ్చి ఔట్ అయ్యాడు. ఆ తర్వాత రెండు బంతుల వ్యవధిలోనే తిలక్.. జెమీసన్ బౌలింగ్‌లో ప్రియాన్ష్‌కు క్యాచ్ ఇవ్వడంతో ముంబై నాలుగో వికెట్ కోల్పోయింది. ముంబై సారథి హార్దిక్ (15) నిరాశపరిచినా ఆఖర్లో నమన్ బౌండరీలతో రెచ్చిపోయాడు.

**అయ్యర్ సూపర్**



భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన పంజాబ్.. బౌల్ట్ వేసిన ఇన్నింగ్స్ మూడో ఓవర్‌లోనే ప్రభ్‌సిమ్రన్ (6) వికెట్ కోల్పోయినా మరో ఓపెనర్ ప్రియాన్ష్ (20), మూడో స్థానంలో వచ్చిన జోష్ ఇంగ్లిస్ (38) దూకుడుగా ఆడటంతో ఛేదనను రసవత్తరంగా మార్చేశారు. ఈ ఇద్దరూ రెండో వికెట్‌కు 18 బంతుల్లోనే 42 రన్స్ జోడించారు. కానీ రెండు ఓవర్ల వ్యవధిలో కింగ్స్ ఈ ఇద్దరి వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే కెప్టెన్ శ్రేయాస్, నెహాల్ వధేర ధాటిగా ఆడి కింగ్స్‌ను మళ్లీ గెలుపు రేసులోకి తెచ్చారు. టాప్లీ వేసిన 13వ ఓవర్లో శ్రేయాస్ హ్యాట్రిక్ సిక్సర్లతో రెచ్చిపోతే బౌల్ట్ ఓవర్లో వధేర రెండు బౌండరీలు బాదాడు. కానీ నెహాల్, శశాంక్ (2) వెంటవెంటనే నిష్క్రమించినా అయ్యర్ ధాటిగా ఆడి లాంఛనాన్ని పూర్తిచేశాడు.

**సంక్షిప్త స్కోర్లు**

ముంబై: 20 ఓవర్లలో 203/6 (తిలక్ 44, సూర్య 44, అజ్మతుల్లా 2/43, స్టోయినిస్ 1/14)బీ

పంజాబ్: 19 ఓవర్లలో 207/5 (శ్రేయాస్ 87నాటౌట్, వధేర 48, అశ్వని 2/48, హార్దిక్ 1/19)

## వన్డే రూల్స్ మారుతున్నాయ్

### 35వ ఓవర్ నుంచి ఒక్క బంతే .. ఐసీసీ నిర్ణయం

దుబాయ్: వచ్చే నెల నుంచి అంతర్జాతీయ క్రికెట్‌లో పలు నిబంధనలు మారనున్నాయి. వన్డేల్లో ప్రస్తుతం ఉన్న రెండు బంతుల నిబంధనపై విమర్శలు రావడంతో ఐసీసీ మార్పులు చేసింది. ఇప్పటి పద్ధతిలో బంతి రివర్స్ స్వింగ్ అయ్యే అవకాశం లేకపోవడంతో బౌలర్లకు ప్రయోజనం లభించడం లేదని సచిన్ కూడా కొన్నేళ్ల క్రితం కామెంట్ చేశాడు. తాజాగా మార్చిన రూల్ ప్రకారం.. మ్యాచ్‌లో 34వ ఓవర్ వరకు రెండు వైపుల నుంచీ కొత్త బంతులనే వినియోగిస్తారు. 35వ ఓవర్ నుంచి మాత్రం.. అంతకు ముందు వాడిన రెండు బంతుల్లో ఒకదాన్నే ఫీల్డింగ్ జట్టు ఎంచుకోవాల్సి ఉంటుంది. ఆ బంతితోనే మిగతా మ్యాచ్‌ను పూర్తి చేయాలి' అని ఐసీసీ పేర్కొంది. ఈ కారణంగా డెత్ ఓవర్లలో బంతి పాతబడి రివర్స్ స్వింగ్‌కు చాన్సుంటుంది. అలాగే కంకషన్ రూల్‌లో మార్పులు చేశారు. ఇక నుంచి మ్యాచ్‌కు ముందే రెఫరీకి ఐదుగురు పేర్లతో కూడిన కంకషన్ రీప్లేస్‌మెంట్ జాబితాను అందించాలి. ఇందులో ఒక కీపర్, బ్యాటర్, పేసర్, స్పిన్నర్, ఆల్‌రౌండర్ ఉండాలి. అలాగే బౌండరీ లైన్ క్యాచ్‌లు, డీఆర్‌ఎస్‌పైనా మార్పుల గురించి త్వరలోనే ప్రకటిస్తామని ఐసీసీ పేర్కొంది. ఈనెల 17నుంచి సవరించిన మార్పులు అమల్లోకి రానున్నాయి.




## పౌలినీకి స్విటోలినా షాక్

### క్వార్టర్స్‌కు స్వియటెక్, సబలెంక, అల్కారజ్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో డిఫెండింగ్ చాంపియన్ స్వియటెక్, టాప్ సీడ్ సబలెంక క్వార్టర్స్‌కు చేరుకున్నారు. అయితే, గతేడాది రన్నరప్ జాస్మిన్ పౌలీనికి 13వ సీడ్ స్విటోలినా షాకిచ్చింది. మ్యాచ్ పాయింట్ నుంచి మలుపుతిప్పిన ఉక్రెయిన్ భామ స్విటోలినా 4-6, 7-6(6), 6-1తో నాలుగో సీడ్ పౌలినీపై అద్భుత విజయంతో ముందంజ వేసి క్వార్టర్స్ చేరింది. మరో ప్రీక్వార్టర్స్‌లో స్వియటెక్ 1-6, 6-3, 7-5తో 13వ సీడ్ రిబకినాపై నెగ్గింది. సబలెంక 7-5, 6-3తో 16వ సీడ్ అనిసిమోవాపై, 8వ సీడ్ క్విన్‌వెన్ జాంగ్ 7-6(5), 1-6, 6-3తో సమ్‌సనోవాపై గెలిచారు. పురుషుల సింగిల్స్‌లో రెండో సీడ్ కార్లోస్ అల్కారజ్ 7-6(8), 6-3, 4-6, 6-4తో 13వ సీడ్ బెన్ షెల్టన్‌పై, 12వ సీడ్ టామీ పాల్ 6-3, 6-3, 6-3తో అలెక్సీ పాపిరన్‌పై గెలిచి క్వార్టర్స్‌లో ప్రవేశించారు.

బోపన్న, యుకీ అవుట్: పురుషుల డబుల్స్‌లో భారత ఆటగాళ్లు రోహన్ బోపన్న, యుకీ భాంబ్రీ మూడో రౌండ్‌లోనే నిష్క్రమించారు. బోపన్న-ఆడమ్ జంట 2-6, 6-7(5)తో హెన్రీ-హ్యారీ ద్వయం చేతిలో, యుకీ-రాబర్ట్ జో డీ 4-6, 4-6తో ఇవాన్-క్రిస్టియన్ ద్వయం చేతిలో ఓడారు.



# అలా చనిపోవాలనుకుంటున్నా..



లాల్ సింగ్ చద్దా తర్వాత మళ్లీ ఇన్నేళ్లకు అమీర్ ఖాన్ తిరిగి ఆడియన్స్ ను అలరించేందుకు రెడీ అయ్యాడు. అమీర్ ఖాన్ నటించిన తాజా సినిమా సితారే జమీన్ పర్ జూన్ 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి ట్రైలర్ రిలీజవగా దానికి ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. సితారే జమీన్ పర్ ప్రమోషన్స్ లో యాక్టివ్ గా పాల్గొంటున్నాడు అమీర్. ప్రస్తుతం ఈ సినిమా ప్రమోషన్స్ లో బిజీగా ఉన్న అమీర్ ఖాన్ తన తర్వాతి సినిమా పనుల్ని వేగవంతం చేశాడు. అమీర్ నెక్ట్స్ చేయబోయే సినిమా, తన డ్రీమ్ ప్రాజెక్టు మహాభారతం అనే విషయం తెలిసిందే. రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో అమీర్ ఖాన్ మాట్లాడుతూ తన ఆఖరి సినిమా గురించి మాట్లాడాడు. ఈ సందర్భంగా మహాభారతం తన ఆఖరి సినిమా అవుతుందేమో అని కూడా ఆయన అన్నాడు. ఇంటర్వ్యూలో భాగంగా అమీర్ ఖాన్ మాట్లాడుతూ, మహాభారతం సినిమా తీయాలనేది తన డ్రీమ్ అని, సితారే జమీన్ పర్ రిలీజయ్యాక ఆ సినిమాపైనే తాను ఫుల్ ఫోకస్ ను పెట్టనున్నట్టు చెప్పాడు. మహాభారతమనేది చాలా పెద్ద ప్రాజెక్టు అని, ఆ సినిమా చేసిన తర్వాత ఇక చేయడానికి ఏమీ లేదని అనిపించొచ్చని దానికి కారణం మహాభారతంలో ఎంతో గొప్ప విషయముండటమేనని అన్నాడు. మహాభారతం గొప్ప ప్రాజెక్ట్ మాత్రమే కాదు, అందులో చాలా ఎమోషన్ కూడా ఉంది. ఈ ప్రపంచంలో ఉన్నదంతా భారతంలో కనిపిస్తుందని అన్నాడు. ఎవరైనా మీ లాస్ట్ మినిట్ ఎలా ఉండాలని కోరుకుంటారని అడిగితే, దానికి తాను పని చేస్తూ చనిపోవాలనుకుంటున్నానని చెప్తానన్నాడు. మనమంతా ఇలానే కోరుకుంటామని, అందుకే మహాభారతం చేశాక ఇక తానేమీ చేయనవసరం లేదనే ఎమోషన్ ను పొందాలనుకుంటున్నట్టు అమీర్ ఖాన్ తెలిపాడు. ఎన్నో ఏళ్లుగా మహాభారతం కథతో జర్నీ చేస్తున్నానని, వెండితెరపై దాన్ని గొప్పగా చూపించాలని కలలు కంటున్నానని, ఈ సినిమా తర్వాత నటుడిగా చేయడానికి ఇంకేమీ లేదనే భావన కలుగుతుందని అన్నాడు. అయితే ఈ కామెంట్స్ ను విన్న అమీర్ ఫ్యాన్స్ మాత్రం ఆయన ఇక సినిమాలు చేయడా అని దిగులు పడుతున్నారు.





## ప్లాస్టిక్ సర్జరీ నా ఇష్టం: సీనియర్ నటి కాజోల్

మెరుపు కలలు సినిమాలో ప్రభుదేవా సరసన నటించింది కాజోల్. తనదైన అందం, ప్రతిభతో ఈ బ్యూటీ కుర్రకారు హృదయాలను దోచుకుంది. 'దిల్ వాలే దుల్హానియా లేజాయేంగే' (డిడిఎల్‌జే) నటిగా కాజోల్‌కి యూత్ లో ఉన్న ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు. ఇక షారూక్ - కాజోల్ జంట తెరపై కనిపిస్తే, బాక్సాఫీస్ వద్ద కాసులు కురిసినట్టే. అయితే ఇటీవలి కాలంలో ఈ జోడీ రిపీట్ కావడం లేదు. కొంతకాలంగా కాజోల్ తన నటనపై సీరియస్‌గానే దృష్టి సారించింది. తాజాగా మా అనే హారర్ థ్రిల్లర్ మూవీలో నటించింది. ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఇటీవలే టీజర్ విడుదల కాగా, ప్రశంసలు కురిసాయి. ఆత్మ ఆవహించిన తన కూతురు చుట్టూ ఉన్న మిస్టరీని ఛేధించే క్రమంలో అరణ్యంలోని పల్లెటూరికి ఉన్న శాపం ఏమిటన్నది తెలుసుకుంటుంది. టీజర్ చాలా భయపెట్టింది.. విజువల్స్ అద్భుతంగా కుదిరాయని ప్రశంసలు కురిసాయి. ఈ మూవీ ప్రమోషనల్ ఇంటర్వ్యూలో కాజోల్ కథానాయికల ప్లాస్టిక్ సర్జరీ వ్యవహారం గురించి ప్రశ్నను ఎదుర్కొంది. కాజోల్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ సర్జరీ అనేది చాలా సంక్లిష్ఠమైన విషయం. అవసరం మేర దీనిని అనుసరిస్తే ఫర్వాలేదు. ముఖంపై మచ్చ తొలగించడానికి లేదా ఎబ్బెట్టుగా ఏదైనా ఉంటే దానిని తొలగించుకునేందుకు సర్జరీ అవసరం. అలా కాకుండా నా దవడ ఎముకను సరి చేయండి.. అందం పెంచండి అంటే అది సరి కాదు. అయినా ముఖం సర్జరీ చేయించుకునే వ్యక్తిది. దానిపై వారికి మాత్రమే హక్కు ఉంటుందని కూడా కాజోల్ అన్నారు. శరీర తత్వాన్ని బట్టి కూడా సర్జరీ అవసరమా కాదా? అనేది నిర్ణయించాలని కూడా తెలిపారు. డిడిఎల్‌జే తర్వాత కెరీర్ పరంగా ఎదిగే క్రమంలో కాజోల్ తన అందం పెంచుకునేందుకు, ముఖానికి శస్త్ర చికిత్స చేయించుకుందని, తన శరీర ఛాయను మెరుగు పరుచుకునేందుకు చాలా ఖర్చు చేసిందని మీడియాలో కథనాలొచ్చాయి. హిందీ చిత్రసీమలో చాలా మంది కథానాయికలు తమ అందాన్ని మెరుగు పరుచుకునేందుకు చాలా శస్త్ర చికిత్సలు చేయించుకుంటున్న సంగతి విధితమే.

## ఎంగేజ్‌మెంట్ వార్తలపై శ్రీలీల క్లారిటీ

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ శ్రీలీల రీసెంట్ గా తన సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు రకరకాల చర్చలకు దారి తీశాయి. తాజాగా శ్రీలీలీ ఆ ఫోటోలకు క్లారిటీ ఇస్తూ నెట్టింట జరుగుతున్న డిస్కషన్స్ కు ఫుల్ స్టాప్ పెట్టింది. నీలి రంగు చీరలో బుగ్గలపై పసుపు, తన చుట్టూ ఫ్యామిలీ మెంబర్స్ ఒక ప్లేట్ లో పసుపు, కుంకుమ పట్టుకుని ఉండటంతో శ్రీలీల ఎవరికీ చెప్పకుండా సైలెంట్ గా ఎంగేజ్‌మెంట్ చేసుకుందనుకున్నారంతా.దానికి తోడు ఆ ఫోటోలను షేర్ చేస్తూ శ్రీలీల బిగ్ డే, కమింగ్ సూన్ అంటూ పోస్ట్ చేయడంతో అమ్మడు ఓ ఇంటిది అయిపోతుందనుకున్నారంతా. అయితే ఇప్పుడు ఆ వార్తలకు చెక్ పెడుతూ ఓ వీడియోను శ్రీలీల పోస్ట్ చేసింది. ఆ వీడియోలో శ్రీలీల గ్రీన్ కలర్ పట్టు శారీలో పెళ్లి కూతురిలా ముస్తాబై కనిపించింది. పూర్వంలో మన ఇంట్లో పుట్టిన రోజులు ఇలానే జరుపుకునేవాళ్లం అంటూ వీడియోను షేర్ చేసింది. శ్రీలీల చెప్పినదాన్ని బట్టి చూస్తుంటే ఇదంతా శ్రీ లీల తల్లి ప్లాన్ చేసింది. జూన్ 14న శ్రీలీల బర్త్ డే జరుపుకోనుండగా, కూతురి ప్రీ బర్త్ డే సెలబ్రేషన్స్ ను ఇలా డిఫరెంట్ గా ప్లాన్ చేసింది. ఈ ఫోటోల్లో సాఫ్ట్ పింక్ కలర్ దుస్తులు, దానికి తగ్గ జ్యుయలరీ ధరించి బుగ్గన చుక్క కూడా పెట్టడంతో శ్రీలీల లుక్ పెళ్లి కూతురిని తలపించింది. ఈ ఫోటోల్లో శ్రీలీల ఎక్స్‌ప్రెషన్స్, తన ఫ్యామిలీతో ఉన్న బాండింగ్ చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం పలు సినిమాలతో బిజీగా ఉన్న శ్రీలీల మరో పదేళ్ల వరకు పెళ్లి చేసుకోనని ఆల్రెడీ చెప్పిన సంగతి తెలిసిందే. అయితే గత కొన్నాళ్లుగా శ్రీలీల బాలీవుడ్ హీరో కార్తీక్ ఆర్యన్ తో డేటింగ్ లో ఉందని కూడా వార్తలొస్తున్నాయి.



## మొన్న అలియా భట్.. ఇప్పుడు త్రిష..

నాలుగు పదుల వయసులో కూడా త్రిష చేతినిండా సినిమాలతో కెరీర్లో దూసుకెళ్తుంది. రీసెంట్ గా గుడ్ బ్యాడ్ అగ్లీ మూవీతో సూపర్ హిట్ ను తన అకౌంట్ లో వేసుకున్న త్రిష సుమారు రెండు దశాబ్దాలుగా సినీ రంగంలో సత్తా చాటుతుంది. మధ్యలో కెరీర్ కు బ్రేక్ వచ్చినప్పటికీ పొన్నియన్ సెల్వన్ తర్వాత అమ్మడి క్రేజ్ పెరిగింది. దీంతో సెకండ్ ఇన్నింగ్స్ లో కూడా త్రిషకు మంచి ఆఫర్లు దక్కుతున్నాయి. తమిళ, తెలుగు, మలయాళ, కన్నడ భాషల్లో అనేక సినిమాల్లో నటించిన త్రిష చేతిలో ప్రస్తుతం థగ్ లైఫ్, విశ్వంభర సినిమాలున్నాయి. కమల్ హాసన్ సరసన మణిరత్నం దర్శకత్వంలో త్రిష నటించిన థగ్ లైఫ్ సినిమా రిలీజ్ కు రెడీ అయింది. జూన్ 5న థగ్ లైఫ్ ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకులు ముందుకు రానుంది. ప్రమోషన్స్ లో భాగంగా పలు ఈవెంట్స్ లో పాల్గొంటున్న త్రిష కొన్ని ఇంట్రెస్టింగ్ విషయాలను షేర్ చేసుకుంటుంది. మలయాళీ నటుడు ఫహాద్ ఫాజిల్ అంటే తనకు ఇష్టమని, ఆయనతో కలిసి నటించడం తనకు చాలా ఇష్టమని చెప్పుకొచ్చింది. మీరు ఎవరితో నటించాలనుకుంటున్నారని రీసెంట్ గా ఓ సందర్భంలో త్రిషను అడగ్గా అమ్మడు ఫహాద్ ఫాజిల్ పేరు చెప్పింది. ఫహాద్ ఫాజిల్ తో నటించాలనుంది. అతనెలాంటి కథనైనా, ఎలాంటి క్యారెక్టర్‌లో అయినా అద్భుతంగా నటించగలడు. అతను చాలా అద్భుతమైన నటుడు అని మనసులోని మాటను బయటపెట్టింది త్రిష.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com